# ప్రజాస్వరం

PRAJASWARAM

తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి 17 | సంచిక 313 | prajaaswaram9@gmail.com | పేజీలు 07 | వెల రూ. 1.00

Published from Telangana & Andhra Pradesh

మంగళవారం, జులై 23, 2024


## రసవత్తరంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు

బరిలోంచి తప్పకుంటున్నట్లు బైడెన్ ప్రకటన

కమలా హారిస్‌కు మద్దతు తెలిపిన అధ్యక్షుడు జోబైడెన్

తొలిసారి రేసులో భారత సంతతి అమెరికా మహిళ

బైడెన్ తప్పకోవడాన్ని స్వాగతించిన ఒబామా

అనూహ్యంగా మిషెల్ ఒబామా పేరు తెరపైకి రాక



7

## సభలో విపక్షాలు సమయాన్ని వృథా చేస్తున్నాయ్

సమస్యలను ప్రస్తావించకుండా అడ్డుకునే యత్నాలు

బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగాలని ఆకాంక్ష : మోడీ

న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):

కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన తరువాత ఎన్డీయే సర్కార్ తొలి బడ్జెట్‌ను మంగళవారం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు విలువైన సమయాన్ని ప్రతిపక్షాలు వృథా చేస్తున్నాయని ఆయన విమర్శించారు.'నేను బరువెక్కిన హృదయంతో చెబుతున్నా... కొందరు ఎంపీలు, ఇతరులను తమ నియోజకవర్గ సమస్యలపై సభలో మాట్లాడే సమయం ఇవ్వకుండా చేస్తున్నారు. రాజకీయ విభేదాలను - మిగతా 2లో..



## గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు

ఐదురోజుల పాటు సమావేశాల నిర్వహణ

బీఏసీ సమావేశంలో నిర్ణయం

సమావేశానికి వైకాపా గైర్హాజరు

గవర్నర్‌ను రాచమార్గంలో రప్పించామన్న స్పీకర్

వివరాలు 6లో

## మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి
# రూ.10వేల కోట్లు ఇవ్వండి





జల్ జీవన్ మిషన్ నిధులు విడుదల చేయండి..

గ్యాస్ సబ్సిడీ ఓఎంసీలకు ముందుగానే చెల్లించండి

పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి..

కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్‌దీప్ సింగ్ పూరీ, జోషిలకు సిఎం రేవంత్ వినతి

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద రూ.పది వేల కోట్లు కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడ లేని విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు సి.ఆర్.పాటిల్, హర్ దీప్ సింగ్ పూరీ, ప్రహ్లాద్ జోషిలను ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. - న్యూఢిల్లీ, ప్రజాస్వరం

6

## ప్లకార్డులతో...
## అసెంబ్లీలోకి ప్రవేశించే యత్నం

జగన్‌ను అడ్డుకున్న పోలీసులు

పోలీసులపై వేలెత్తి చూపుతూ జగన్ ఆగ్రహం



అమరావతి,జూలై22(ప్రజాస్వరం):

ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వైకాపా ఎమ్మెల్యేలు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. సమావేశాలకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు నలుపు కండువాలతో వస్తుండగా.. లోపలికి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై వైకాపా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జగన్ అభ్యంతరం తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించవద్దని చెప్పడంపై మండిపడ్డారు. పేపర్లు గుంజుకుని చింపేసే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని.. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులపై వేలు చూపుతూ హెచ్చరించారు. పోలీసు అధికారి మధుసూదనరావును ఉద్దేశిస్తూ మధుసూదనరావు.. గుర్తు పెట్టుకో.. ఎల్లకాలం ఇలాగే ఉండదని హెచ్చరించారు. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నాం. నీ టోపీపై ఉన్న సింహాలకు అర్థమేంటో తెలుసా? అధికారంలో ఉన్నవారికి సెల్యూట్ కొట్టడం కాదు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మీరున్నారు' అని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పోలీసులు, వైకాపా ఎమ్మెల్యేల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మారే.. - మిగతా 2లో..

## వివాదంలో.. ఐఎఎస్ స్మితా సబర్వాల్

సివిల్స్ ఎంపికలో వికలాంగ కోటాపై పోస్ట్

తేనెతుట్టెను కదపడంతో పలువురు విమర్శలు



హైదరాబాద్,జూలై22(ప్రజాస్వరం):

ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్ వివాదం తర్వాత ఇప్పుడు సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానం గురించి కొత్త చర్చ మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ఐఏఎస్‌లో వికలాంగుల కోటాపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్'లో పంచుకున్నారు. ఈ చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. వైకల్యం ఉన్న పైలట్‌ను ఎయిర్‌లైన్ నియమించుకుంటుందా? లేదా - మిగతా 6లో..

## తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

గోదావరికి ఉధృంతగా వరదనీరు

పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ

శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం

గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష

2



## మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

పూర్తిగా దగ్ధం అయిన రికార్డులు

అసెంబ్లీలో సమీక్షించిన సీఎం చంద్రబాబు

వెంటనే విచారణకు ఆదేశం

సంఘటనా స్థలానికి డిజిపి, సిఐడి చీఫ్

ఉద్యోగి గౌతమ్‌పై అనుమానాలతో అరెస్ట్

6



2

## ఢిల్లీలో బిజీబిజీగా సీఎం రేవంత్

కాంగ్రెస్ నేతలు ఖర్గే,ప్రియాంకలతో భేటీ

రాష్ట్ర రాజకీయాలపై చర్చ

## దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం

2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించే లక్ష్యం

కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే వ్యాధులకు కారణం

అంచనా వేసిన ఆర్థిక సర్వే..పార్లమెంట్‌కు సమర్పణ



5

# సభలో విపక్షాలు సమయాన్ని వృధా చేస్తున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

పక్కనబెట్టి నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలి. సభలో నిరసనలు చేయడమే పనిగా పెట్టుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని రాజ్యాంగ విరుద్ధంగా నిశ్శబ్దం చేసేందుకు ప్రయత్నించారని మోదీ అన్నారు. ఇదివరకు జరిగిన సభల్లో రెండున్నర గంటలు నాపై ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు మాట్లాడాయి. ప్రజాస్వామ్య సంప్రదాయాల్లో ఇలాంటి వ్యాఖ్యలకు తావుండదు. వీటన్నింటినీ దేశం నిశితంగా పరిశీలిస్తోంది. విపక్షాలు నిర్మాణాత్మక సలహాలు ఇవ్వాలి. కనీసం ఈ సమావేశాలైనా సజావుగా సాగుతాయని ఆశిస్తున్నా. 2014 తర్వాత కొంతమంది ఎంపీలు ఒకసారి, మరికొందరు రెండోసారి గెలిచారని అన్నారు. కానీ.. విపక్షాల అరుపుల మధ్య వారిలో చాలా మంది వారి సమస్యలను సభాసాక్షిగా వినిపించలేకపోయారు. ఇక నుంచైనా సమావేశాలను సజావుగా సాగనిస్తూ.. ప్రజల ఆకాంక్షలను సభలో వినిపించనివ్వండి. 60 సంవత్సరాల తరువాత వరుసగా మూడు సార్లు ఓ పార్టీ అధికారంలోకి రావడం ఇదే తొలిసారి. మూడోసారి అధికారం చేపట్టాక తొలి బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నాం అని మోదీ వ్యాఖ్యానించారు. సుపరిపాలనకు ఈ బడ్జెట్ ముఖ్యమైనది. రాబోయే 5 ఏళ్లకు ఇది దిశానిర్దేశం చేస్తుంది. 2047 వికసిత్ భారత్ లక్ష్యానికి బలమైన పునాది అవుతుంది. గత మూడేళ్లలో దేశం 8 శాతం ఆర్థిక వృద్ధిని సాధించింది. దేశంలో పెట్టుబడిదారులకు సానుకూల వాతావరణం ఉంది. అందుకు తగినట్లు వేల సంఖ్యలో కంపెనీలు భారత్‌కి వచ్చి పెట్టుబడులు పెడుతున్నాయ్. లక్షల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాయ్' అని మోదీ పేర్కొన్నారు.

# ప్లకార్డులతో అసెంబ్లీలోకి ప్రవేశించే యత్నం

(మొదటి పేజీ తరువాయి)

సూచనలు అసలు కనిపించడమే లేదు. చివరకు పోలీసులతో కూడా గొడవ పడుతున్నారు. అసెంబ్లీ లోపలికి వైఎస్ జగన్ కారును అనుమతించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ 4 వ నంబరు గేటు బయట దిగి లోపలికి వెళ్లేలా నిబంధనలు ఉన్నాయి. ప్రతిపక్ష హోదా లేకున్నా అసెంబ్లీ లోపలికి జగన్ వాహనం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వైసీపీ శాసన సభపక్ష విన్నపం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం ఇంతటి బంపరాఫర్ ఇచ్చినా కూడా పోలీసులతో తనను మెయిన్ గేటు నుంచి అసెంబ్లీలోకి వెళ్లనివ్వాలని జగన్ వాగ్వాదానికి దిగారు. తనను అసెంబ్లీ మెయిన్ గేటు నుంచి వెళ్లనివ్వాలని జగన్ డిమాండ్ చేశారు. అయితే గవర్నర్ వస్తున్నారని అందువలన వేరే గేట్ నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో గొడవకు దిగారు. శాసన సభ గేట్ వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేయాలని జగన్ సూచించారు. ఆపై పోలీసులు డౌన్ డౌన్ అంటూ గేటు వద్ద వైఎస్ జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు ఓవర్ యాక్షన్ చేశారు. ఇదే సమయంలో గవర్నర్ కాన్వాయ్ రావడంతో వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలకు వెళ్లనివ్వలేదు. చివరకు చేసేది లేక వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలకి వెళ్లింది. విధుల్లో ఉన్న పోలీసులపై వైఎస్ జగన్ అనుచితంగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. రోజులు ఇలాగే ఉండవంటూ బహిరంగంగా పోలీసులను జగన్ బెదిరించారు. ప్ల కార్డులు, నల్ల కండవాలతో అసెంబ్లీకి వస్తున్న జగన్ ని పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డ్స్, నల్ల కండవాలు తొలగించాలని పోలీసులకు ఎవరు ఇచ్చారు అధికారం అంటూ జగన్ ÷ర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు జగన్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై జగన్ మండిపడ్డారు.

# ప్రజలు బుద్ధి చెప్పినా మారని జగన్

మొదటి పేజీ తరువాయి

కొనసాగుతామనే భ్రమ నుంచి ప్రజలు బయట పడేసినా ఇంకా తనే సీఎం అనుకుంటున్నారేమోనని ఎద్దేవా చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. తాను, జనసేన పార్టీ నూటికి నూరు శాతం సహకరిస్తుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ కమిటీ హాల్లో ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం జరిగింది. చంద్రబాబు అధ్యక్షతన శాసనసభా పక్షం ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పవన్ కల్యాణ్ హాజరయ్యారు. అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రస్తావించాల్సిన అంశాలపై చర్చించారు. తొలి రోజునే సభలో వైసీపీ చేసిన ఆందోళనను పలువురు సభ్యులు ప్రస్తావించారు. జగన్ సహా వైసీపీ సభ్యులు అసహనంతో ఉన్నారని కొందరు సభ్యులు వ్యాఖ్యానించారు. పోలీసులపై ఈ స్థాయిలో విరుచుకుపడి తనలోని అసహనాన్ని జగన్ బయటపెట్టుకున్నారని పలువురు జనసేన ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు.

# నూతన న్యాయ చట్టాలపై మీ వైఖరేంటి

### ప్రభుత్వానికి బిఆర్ఎస్ నేత కెటిఆర్ లేఖ

**హైదరాబాద్,జూలై22(ప్రజాస్వరం):**

దేశంలో అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాలపైన రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వివిధ వర్గాల నుంచి కొత్త న్యాయ చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయి. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకువచ్చే ప్రమాదం ఉన్నదని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తు న్నారు. నూతన చట్టాలపైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తెలంగాణ గడ్డపైన నిరంకుశ, నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యధాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా? లేక తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలి. ఇప్పటికైనా రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలి. నూతన చట్టాల్లో ఉన్న నియంతృత్వ పూరిత సెక్షన్లను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి వెంటనే లేఖ రాయాలి. దీంతో పాటు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రం తరఫున ఒక తీర్మానాన్ని కేంద్రానికి పంపించాలి. లేకుంటే ఈ ప్రభుత్వాన్ని ప్రజలు నిరంకుశ ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా పరిగణిస్తారని గుర్తుంచుకోవాలి అని కేటీఆర్ సూచించారు.

# తెలుగు రాష్ట్రాల్లో పొంగుతున్న వాగులు

### గోదావరికి ఉధృంతగా వరదనీరు
### పరీవాహకాల్లోని ప్రాజెక్టుల్లో జలకళ
### శ్రీశైలానికి ఉరకలెత్తుతున్న కృష్ణా ప్రవాహం
### గోదావరి వరదపై మంత్రి పొంగులేటి సమీక్ష



**విజయవాడ/హైదరాబాద్,జూలై22(ప్రజాస్వరం):**


ఉభయ తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన నదులు కృష్ణా, గోదావరులు పొంగుతున్నాయి. ప్రధానంగా గోదావరికి వరద పోటెత్తుతోంది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గత మూడు రోజులుగా ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరుల నుంచి వరద వచ్చి చేరుతోంది. తెలంగాణలోని గోదావరి పరీవాహకం లోనూ భారీ వర్షాలు పడుతుండటంతో కిన్నెరసాని, ముర్రేడు, కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ-అన్నారం బ్యారేజీల మధ్య వాగుల నుంచి పెద్దఎత్తున వరద వచ్చి గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో ప్రవాహం పెరుగుతోంది. మేడిగడ్డ వద్ద 5.52 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. అన్నారం బ్యారేజీకి 16,850 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండడంతో 66 గేట్లు ఎత్తి అదేస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇంద్రావతి కలిసిన అనంతరం సమ్మక్క బ్యారేజీ వద్ద 8.23 లక్షల క్యూసెక్కులు, దుమ్ముగూడెం సీతమ్మసాగర్ ఆనకట్ట వద్ద 9.01 లక్షల క్యూసెక్కుల ప్రవాహంతో గోదావరి ఉగ్రరూపం దాల్చుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి(43 అడుగులు)ని నది దాటింది. నదీ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గక పోవడంతో మరికొంత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ జలాశయంలోకి ఎగువ నుంచి 18,518 క్యూసెక్కుల వరద చేరుతోంది. నిర్మల్ జిల్లాలోని కడెం నారాయణరెడ్డి జలాశయంలో ఆదివారం ఉదయం నాలుగు వరద గేట్లు ఎత్తారు. మధ్యాహ్నానికి వరద తగ్గడంతో ఒక గేటు మూసేసి మూడు గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు. కృష్ణా నదిలో ఎగువన వరద పెరుగుతోంది. కర్ణాటకలో ఆలమట్టి, నారాయణపూర్ జలాశయాల కింద అప్రమత్తత ప్రకటించారు. ఆదివారం సాయంత్రానికి ఎగువ నుంచి భారీ ప్రవాహాలు వస్తుండటంతో ఆలమట్టి నుంచి దిగువకు 1.50 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను ప్రారంభించారు. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నట్లు కర్ణాటక జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తం చేశారు. నారాయణపూర్ నుంచి 25 గేట్లు తెరిచి 1.45 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. దీంతో జూరాలకు వరద పెరిగింది. ప్రాజెక్టు 22 గేట్లను తెరిచారు. శ్రీశైలం జలాశయం వద్ద 96 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. భారీ వర్షాల నేపథ్యంలో గోదావరి నది పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలని పరీవాహక జిల్లాల కలెక్టర్లను రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. వరద పరిస్థితులపై ఆదివారం హైదరాబాద్‌లో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. నదులు, వాగుల ప్రవాహాలతో ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూంలను ఏర్పాటు చేసి.. సమన్వయం చేయాలని కోరారు. రెస్క్యూ బృందాలు, ఎన్డీఆర్ఎఫ్ బృందాల సాయాన్ని తీసుకోవాలని సూచించారు.






# ఢిల్లీలో బిజీబిజీగా సిఎం రేవంత్













### కాంగ్రెస్ నేతలు ఖర్గే,ప్రియాంకలతో భేటీ
### రాష్ట్ర రాజకీయాలపై చర్చ

**న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):**

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో బిజిబిజిగా గడుపుతున్నారు. కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని కలిశారు. ఆ తరవాత కాంగరెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతోనూ సమావేశం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపదాస్ మున్షీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రియాంక, ఖర్గేలతతో సమావేశం అయ్యారు. నామినేటెడ్ పదవులు, కేబినెట్ విస్తరణ, వరంగల్ సభ గురించి నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటికానున్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా రాష్ట్రంలోని తాజా రాజకీయ అంశాలను వివరించడంతోపాటు.. రైతు రుణమాఫీ, రాష్ట్ర బడ్జెట్ సెషన్ లో ఉండబోయే కీలక అంశాలను వివరించే చాన్స్ ఉంది. అలాగే ఈ నెలాఖరులో వరంగల్ లో రైతు కృతజ్ఞత సభను నిర్వహించే అంశాలను హైకమాండ్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఈ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నట్లు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినందున.. ఢిల్లీ పర్యటనలో రాహుల్‌ను కలిసి ఆహ్వానించనున్నట్లు తెలిసింది. అగ్రనేతలతో భేటీకి ముందు పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తో రేవంత్ భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పీసీసీ కొత్త చీఫ్ నియామకం, కేబినెట్ విస్తరణ, నామినేటెడ్ పదవులపై చర్చించనున్నారు. ఢిల్లీ పర్యటనలో పొలిటికల్ అంశాలతో పాటు, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై సీఎం ఫోకస్ చేయనున్నారు. ఇందులో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో ఆయన భేటీ కానున్నట్లు సీఎంవో వర్గాల ద్వారా తెలిసింది.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట



# ప్రభుత్వ పాఠశాలలను బతికించుకుందాం

- జిల్లా కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, గజ్వేల్ 22 (ప్రజా స్వరం) :

తల్లిదండ్రులు ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి పిలుపునిచ్చారు. సోమవారం జగదేవ్‌పూర్ మండలంలోని నిర్మల్ నగర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, అలిరాజ్‌పేట ప్రాథమిక పాఠశాల, జగదేవ్ పూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, గజ్వేల్ మండలంలోని అక్కారం గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు. 2015 నుండి నిర్మల్ నగర్ ప్రాథమిక పాఠశాల, అలిరాజ్ పేట ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు రాక మూతపడడంతో ఈ విద్యా సంవత్సరంలో గ్రామాల్లో ప్రజలను ప్రోత్సహించి పాఠశాలల్లో చేరేలా తల్లిదండ్రులను ఒప్పించినందుకు విద్యాశాఖ అధికారులను జిల్లా కలెక్టర్ అభినందించారు. పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్ లేరని, అలాగే మరుగుదొడ్లు తాగునీటి వసతి కల్పించాలని, పాఠశాల ఆవరణ ప్రహరీ బాగుందని, కానీ, కుక్కలు లోనికి పోకుండా పెద్ద గేట్‌ని ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌ని కోరారు. సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే పాఠశాలలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నానని, అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. అన్ని పాఠశాలల్లో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కేజీబీవీ పాఠశాల తరగతి గదిలో విద్యార్థులకు గణితంలో గుణితాలకు సంబంధించిన సబ్జెక్ట్‌ని బోధించారు. ఏదైనా సబ్జెక్ట్ నేర్చుకోవాలి అనుకుంటే సబ్జెక్ట్ గుర్చి పూర్తి అవగాహన కలిగి ఉండి షార్ట్ కట్ మెథడ్ లో సమస్యలు పరిష్కరించేలా ఆలోచించాలని, లాంగ్వేజెస్ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ రెగ్యులర్‌గా మాట్లాడుతూ ఉంటేనే సబ్జెక్టు వస్తాయని, తెలుగు మన మాతృభాష మనం రోజు ఇంట్లో బయట అందరూ అదే భాషను మాట్లాడటం వల్ల సులభంగా అర్థమవుతుందన్నీరు. ఇంగ్లీష్‌లలో కూడా పాఠశాల,



ఆవరణలో తరచూ మాట్లాడుతూ ఉంటే ఆ సబ్జెక్టులు కూడా సులభంగా అర్థం చేసుకోవడం, చదవడం మాట్లాడగలుగుతామని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అక్కారం ప్రాథమిక పాఠశాలలో తరగతి గదిలో విద్యార్థులతో బోర్డు పై గణిత సమస్యలు పరిష్కరించినందుకు చప్పట్లు కోట్టి అభినందించారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని భుజించారు. అలాగే విద్యార్థులు భోజనంలో కూరను కలుపుకొని తినేలా తెలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏదో మొక్కుబడిగా భోజనం పెడుతున్నం వారు తింటున్నారు. రుచికరమైనదిగా తయారీ చేసి పిల్లలు తప్పకుండా పూర్తిగా తినేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. పాఠశాలలో పిల్లలకు నల్లా సమస్య ఉందని గమనించి ఇంజినీరింగ్ ఏజెన్సీ బ్యాటరీ ఆఫ్ ట్యాప్ కనెక్షన్ నిర్మించేందుకు ప్రతిపాదన సిద్ధం చేయాలని సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు గుడ్లు, ఆకుకూరలు పప్పులు లాంటి పౌష్టికాహారాన్ని అందించాలని వంట సిబ్బందికి తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, కేజీబీవీ మరియు మోడల్ స్కూల్ లాంటి అనేక పాఠశాలలు ఉన్నాయి. అన్ని పాఠశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయి. పిల్లలు ప్రవేట్ పాఠశాలల కాకుండా గవర్నమెంట్ పాఠశాలలో చేర్పించేందుకు ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని అలాగే పాఠశాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి ప్రతి ఒక్క ఫెసిలిటీ అందించే విధంగా తయారు చేస్తున్నాం. పాఠశాలలో మంచి వాతావరణాన్ని తయారు చేయడానికి వివిధ పాఠశాలలను తరచు పర్యవేక్షణ చేస్తూ ఉంటానన్నారు. జిల్లాలో మూతపడిన పాఠశాలలు, తక్కువ విద్యార్థులు గల పాఠశాలలపై ఎక్కువ శ్రద్ధ తీసుకొని తల్లిదండ్రులను ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించేందుకు మోటివేషన్, కన్విన్స్ అయ్యేలా చేసే కార్యచరణ రూపొందించడం జరిగిందని దాంట్లో భాగంగానే మండలాల్లో గల పాఠశాలను పర్యటించడం జరుగుతుందన్నారు. కేజీబీవీ సంబంధించి ఆవరణ చుట్టూ ప్రహరీ గోడ సమస్య ఉన్నదని తెలుపగా సర్వేయర్‌ని పిలిచి చుట్టూ డిమార్కింగ్ చేసి ప్రహరీ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కలెక్టర్ వెంట స్థానిక ఆర్డీవో బన్సీలాల్, జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ప్రజావాణిలో 136 దరఖాస్తుల స్వీకరణ: కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జులై 22 (ప్రజా స్వరం) :

సమస్యల పరిష్కారం కృషి చేసిన నేరుగా ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి చెప్పుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం మెదక్ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ వివిధ సమస్యలపై ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చి చెప్పుకోవాలని, ఇతరుల మీద ఆధారపడరాదని సూచించారు. వివిధ ప్రజలు పెట్టుకున్న 136 అర్జీలను వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం 18, ధరణి భూ సమస్యల కోసం 36, పింఛన్లు కోసం 08, రుణమాఫీ 07, ఇతర సమస్యలు 67 ప్రజలు ప్రజావాణిలో దరఖాస్తుల సమర్పించారు.




# మేడ్చల్‌లో పుర్రె లభ్యం కలకలం..

మేడ్చల్, జూలై 22 (ప్రజా స్వరం) :

గుర్తు తెలియని మహిళ పుర్రె లభ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఓ వెంచర్ లో సోమవారం చోటు చేసుకుంది. గుర్తు తెలియని మనిషి పుర్రె లభ్యమైన ఘటన వెలుగులోకి రావడంతో స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం అత్వెల్లి లోని నార్నే ఎస్టేట్ లో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బందికి మనిషి పుర్రె, వెంట్రుకలు, చీర, జాకెట్, చేతి సంచి, ఒక చెప్పును కనిపించాయి. దీంతో వారు పోలీస్ లకు సమాచారం ఇచ్చారు. దీంతో సమాచారం కున్న సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మురలీధర్ లు గాంధీ ఆస్పత్రి నుంచి ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజుతో పాటు 5 మంది సిబ్బందితో కలిసి ఘటనా స్టలిని సందర్శించి ఆధారాలు సేకరించారు. ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కె.వి నాగరాజు మాట్లాడుతూ గత 6నెలల క్రితం ఈ హత్య జరిగి ఉండొచ్చని తెలిపారు. ఘటనా స్థలిలో చీర, బ్లౌజ్, చేతి సంచి, చెప్పును గుర్తించి స్వాదీనం చేసుకున్నారు. వస్తువులను ఎవరైనా గుర్తిస్తే వెంటనే మేడ్చల్ పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని సీఐ తెలిపారు.



మండలంలోని శ్రీరంగవరం గ్రామ మాజీ సర్పంచ్ విజయానంద్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు సద్ది ప్రకాష్ రెడ్డి, యాదయ్యగౌడ్, నాగార్జునరెడ్డి, జీనత్ రెడ్డి. ఆసిఫ్, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- మేడ్చల్, జూలై 22 (ప్రజా స్వరం)



# అభివృద్ధి పనులపై సీఎం కార్యదర్శి సమీక్ష

వికారాబాద్, జూలై 22(ప్రజా స్వరం):

వికారాబాద్ జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక రాజ్ సోమవారం కడ(కొడంగల్ డెవలప్మెంట్ అథారిటీ) కార్యాలయంలో వికారాబాద్, నారాయణపేట జిల్లా కలెక్టర్లు ప్రతీక్ జైన్, సిక్తా పట్నాయక్ లతో సమీక్షించారు. నారాయణపేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, వికారాబాద్, నారాయణపేట్ అసిస్టెంట్ కలెక్టర్లు ఉమా హారతి, గరిమ నరుల, కడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి లు సమీక్షలో ఉన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య మంత్రి కార్యదర్శికి పూల బొకే తో స్వాగతించారు.

# వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, జులై 22 (ప్రజా స్వరం) :

ఈ నెల 25న ఉదయం 11 నుండి సాయంత్రం 4 గంటల వరకు మెదక్ ప్రభుత్వ వైద్యశాలలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో గౌరవ వేతన కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు 25, అసోసియేట్ ప్రొఫెసర్లు 28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 56 భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్ట్‌కు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎండీ, ఎంఎస్, డీఎన్బీ డిగ్రీలో సాధించిన మార్కులు ట్యూటర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు పరిగణలోకి తీసుకుంటామని ఆర్ఓఆర్‌ను అనుసరిస్తారని తెలిపారు. ట్యూటర్ సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుదారుడి వయస్సు 31 3 2025 నాటికి 45 ఏళ్ల లోపు ఉండాలని స్థానికేతర అభ్యర్థుల కంటే స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రొఫెసర్ల వేతనం 1,90,000 ఉంటుందని, అసోసియేట్ ప్రొఫెసర్ల వేతనం 1,50,000, అసిస్టెంట్ ప్రొఫెసర్ల వేతనం 1,25000 ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మెదక్ జిల్లా డైరెక్టర్ ఆఫ్



మెడికల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ తెలంగాణ రాష్ట్రం ఆధీనంలో పనిచేయడానికి 31, 3, 2025 వరకు గౌరవ వేతనం ప్రాతిపదికన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టులు నియామకం చేస్తున్నామన్నారు. స్థానికేతర అభ్యర్థుల కంటే స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. బయటి రాష్ట్ర అభ్యర్థుల తమ నియామకాన్ని ధ్రువీకరించడానికి ఎంపికైన వారం రోజుల్లోగా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ నుండి తమ అర్హతను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఒరిజినల్ అకాడమిక్ సర్టిఫికెట్లు పాస్పోర్ట్ సైజ్ ఫోటో రెండు సెట్లు అకాడమిక్ సర్టిఫికెట్ల ఫోటో కాపీలతో ఈ నెల 25వ తారీకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 04 గంటల వరకు మెదక్ జిల్లా ప్రభుత్వాస్పత్రిలోని పర్యవేక్షక చాంబర్‌లో ఇంటర్వ్యూలు హాజరుకావాలని పేర్కొన్నారు.

# వినూత్న ఆవిష్కరణలకు అవకాశం

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, జూలై 22(ప్రజా స్వరం):

స్థానిక సమస్యల పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలకు అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తోందని, వినూత్న ఆవిష్కరణ దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ ఆగస్టు 3, 2024, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ ఏర్పాటు చేసిందని, గృహిణి నుండి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తుందని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 3 ఆగస్టు 2024 అన్నారు. ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ ప్రోగ్రాం ఏర్పాటు చేసిందని, గృహిణి నుండి పాఠశాలలు, కళా శాలలు స్థాయి విద్యార్థులు, విద్యావేతలు, వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైన ఇందులో పాల్గొనవచ్చుని అయన తెలిపారు.

**దరఖాస్తు చేసుకొనే విధానం...**



- పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా

**ఆవిష్కరణ పేరు**

- ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాలలో రాసి పంపండి.
- ఆవిష్కరణ 4 ఫొటోలు.
- ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు.
- పైన చెప్పిన వివరాలు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నెంబర్ 9100678543కు ఆగష్టు 3వ తేదీ 2024 లోపు పంపించాలని తెలిపారు.
- ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందన్నారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు లింగ్యా నాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి, ఆర్డీవో వాసుచంద్ర, ఇన్నోవేషన్ మిత్ర వినీత్ సిధార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం వెంటనే 42 శాతం బీసీ డిక్లరేషన్ చేయాలి

- పూడూరు మండల బీజేపీ నాయకులు డిమాండ్

వికారాబాద్, జూలై 22(ప్రజా స్వరం):

వికారాబాద్ జిల్లా పూడూరు మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సెంట్రల్ పిలిం సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేష్ పటేల్, పూడూర్ మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు రమేష్ యాదవ్, పూడూర్ బీజేపీ మండల అధ్యక్షులు రాఘవేందర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు బీసీలకు 23 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 42 శాతం ఇస్తానని మాట ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే 42 శాతం బీసీ డిక్లరేషన్ చేయాలని కోరుతూ సోమ వారం పూడూరు తహసీల్దార్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూడూర్ మండల ప్రధాన కార్యదర్శులు రామచంద్రయ్య, రాఘవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాజు, మాణిక్యం, మండల ఉపాధ్యక్షులు నర్సిములు కంనలపల్లి శివరాజ్ సుభాన్, ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్, బీజేపీ నాయకులు బుచ్చన్న కంకల్ విఠల్ శ్రీనివాస్ బూత్ అధ్యక్షులు సత్యనారాయణ, పూడూరు బీజేపీ నాయకులు బిచ్చన్న, శివరాజు, కంకల్ బూత్ అధ్యక్షులు విట్టల్, పూడూరు బూత్ అధ్యక్షులు సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

- మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని సీఐటీయూ డిమాండ్

వికారాబాద్, జూలై 22 (ప్రజా స్వరం) :

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై 7 నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికులు యూనియన్ సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ హాజరై రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ వర్కర్ విధానం అన్ని పనులు అందరూ కలిసి చేయాలనే నిబంధనల వల్ల రాష్ట్రంలో నైపుణ్యం లేని పనులు చేయడం ట్రాక్టర్ నడపడం కరెంట్ స్థంభాలు ఎక్కి విద్యుత్ సరఫరా లో పనిచేసిన కార్మికులు అకస్మాత్తుగా చాలామంది చనిపోయారు. కుటుంబాలు వీధిన పడ్డాయని అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని ఎవ్వరు కూడా పట్టించుకో లేదని పంచాయతీ ఉద్యోగుల సమస్యలపై గత ప్రభుత్వంపై అనేక పోరాటాలు చేసిన ఎటువంటి ప్రత్యామ్నాయం లభించలేదన్నారు. ఏర్పడిన ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు పర్మినెంట్ చేస్తానని హామీనిచ్చారు. పంచాయతీ సిబ్బంది గత



7 నెలలుగా వేతనాలు లేక దుర్భర పరిస్థితిని అనుభవించారని అప్పుల పాలయ్యారన్నారు. ఈ మధ్యనే రూ 150 కోట్ల పైచిలుకు గ్రామపంచాయతీ సిబ్బంది వేతన గ్రాంటును మంజూరు చేశారు. అందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కానీ కిందిస్థాయిలో అధికారులు ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేదు. తక్షణమే విడుదలైన గ్రాంట్ ఇతర నిధులకు మళ్ళించకుండా గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల ఖాతాలో జమ చేసే విధంగా పై అధికారులు చర్యలు చేపట్టాలని జీవో నెంబరు 51, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పంచాయతీ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటవ తారీఖున వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని, గ్రామపంచాయతీ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్రంలో జీవో నెంబర్ 60 ప్రకారం పంచాయతీ సిబ్బందికి వేతనాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని కారోబార్ బిల్ కలెక్టర్లకు ప్రత్యేక స్టేటస్ ఇవ్వాలని వివిధ పంచాయతీలలో పనిచేస్తున్న సీనియార్టీ గల ఇతర సిబ్బందిని వారి వారి అర్హతలను బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని, పంచాయతీ సిబ్బందికి ఐదు లక్షల ఇన్సూరెన్స్ పీఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలకోరుతూ గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని వినపత్రాలు ఇవ్వాలని, ఈనెల 22న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రాలు ఇవ్వాలని ,తదుపరి అసెంబ్లీ సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి సన్నద్ధమవుతున్నామని తెలిపారు .తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సిబ్బందిని మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రభుత్వం తగు న్యాయం చేయాలని లేనియెడల అసెంబ్లీ సందర్భంగాఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. కార్మికుల అందుకు సన్నద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు జిలాని, నర్సింహులు, శాంతమ్మ, వెంకటమ్మ, భీమయ్య, అంబరప్ప, రాములు, షబ్బీర్, శామప్ప, చందులక్ష్మిహరి, వెంకటప్పలక్ష్మి, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 22 జులై 2024 www.prajaaswaramdaily.com 4PM



# లోక్‌సభలో నీట్ రగడ

## బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే విపక్షాల ఆందోళన

- మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతుండగానే నిరసన
- లీకులతో రికార్డులు సృష్టిస్తున్నారని సెటైర్లు

ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో :

ఎన్డీయే సర్కారు మూడోసారి కొలువుదీరిన తర్వాత తొలిసారి బడ్జెట్ సమర్పించేందుకు సోమవారం నుంచి బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా దుమారం సృష్టిస్తోన్న నీట్ పేపర్ లీక్ అంశం చర్చకు వచ్చింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ అంశంపై మాట్లాడుతుండగా.. విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ప్రతిపక్ష ఎంపీల నినాదాలతో సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. మరోవైపు.. ఈ అంశంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు చేశారు. భారత పరీక్షా వ్యవస్థ ఒక మోసమంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ పేపర్ లీక్‌లపై విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తనను తప్ప అందరినీ నిందిస్తున్నారన్నారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ.. 'గత ఏడేళ్ల కాలంలో పేపర్ లీక్ జరిగిన దాఖలాలు లేవు. ఎన్టీఏ ఇప్పటివరకు 240 పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం నీట్ లీకేజీ వ్యవహారంపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతోంది'' అని వెల్లడించారు. ఈ ప్రభుత్వం పేపర్‌లీక్‌ల విషయంలో రికార్డు సృష్టిస్తుందని ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ప్రధాన్ విద్యాశాఖ మంత్రిగా ఉన్నంతకాలం విద్యార్థులకు న్యాయం దక్కదన్నారు. ఇదిలాఉంటే.. కావడి (కన్వర్) యాత్ర మార్గంలో హోటళ్లపై యజమానుల పేర్లు రాయాలంటూ ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన నిబంధనను విపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి. దీనిపై చర్చ జరపాలంటూ రాజ్యసభలో ప్రతిపక్ష ఎంపీలు ఇచ్చిన నోటీసులను ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తిరస్కరించారు. కాగా, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి శతృఘ్న సిన్హా ఎంపీగా విజయం సాధించారు. ఆయన జూన్‌లో జరిగిన పార్లమెంట్ సమావేశాల సమయంలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేయలేకపోయారు. ఇప్పుడు సభ ప్రారంభం కాగానే ఆయన ప్రమాణం చేశారు.



# సోనియాతో సీఎం రేవంత్ భేటీ

- మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపికపై చర్చ
- కొనసాగుతున్న రేవంత్ ఢిల్లీ పర్యటన

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:

సీఎం రేవంత్ రెడ్డి హస్తిన పర్యటన కొనసాగుతున్నది. సోమవారం ఆయన కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీతో సమావేశమయ్యారు. చాలా రోజులుగా మంత్రివర్గ విస్తరణ, పీసీసీ చీఫ్ ఎంపిక ఎటూ తెగడం లేదు. ఏఐసీసీ, రేవంత్ రెడ్డి, సీనియర్ మంత్రుల నడుమ ఏకాభిప్రాయం కుదరడం లేదని తెలుస్తోంది. దీంతోనే మరోసారి సోనియా గాంధీతో సమావేశమైనట్టు సమాచారం. రైతులకు మొదటి విడతలో చేసిన రుణమాఫీ అంశాన్ని సోనియాగాంధీ కి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వివరించారు. అనంతరం పార్టీ నేతలతో సీఎం భేటీ కానున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీకి సంబంధించి వరంగల్‌లో భారీ సభకు కాంగ్రెస్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీని వరంగల్ సభకు ఆహ్వానించాలని తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయించింది. ఎన్నికల సమయంలోనే వరంగల్ అసెంబ్లీలోనే రుణమాఫీ హామీని కాంగ్రెస్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం ఢిల్లీ వెళ్లారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి శనివారం నాడు ఢిల్లీ వెళ్లారు. వీరంతా ఈరోజు రాహుల్ గాంధీని కలిసి వరంగల్ సభకు రావాల్సిందిగా ఆహ్వానించనున్నారు.

# అడవిలో చిక్కుకున్న పోలీసు బలగాలు

- ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా రక్షణ చర్యలు

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

భారీ వర్షాల కారణంగా అడవిలో చిక్కుకున్న పోలీసు బలగాలను హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రదేశానికి తరలించారు. వారం రోజుల క్రితం ములుగు జిల్లా వాజేడు మండలం సరిహద్దు ప్రాంతమైన ఛత్తీస్ ఘడ్ అడవుల్లో పోలీసు బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. వీరు ఎలిమిడి ఎన్‌కౌంటర్ లో పాల్గొని తిరుగు ప్రయాణం అవుతుండగా వర్షాలు తీవ్రమయ్యాయి. దీంతో వాజేడు మండల పరిధిలోని పెనుగోలు గుట్టల్లో చిక్కుకుపోయారు. ఆ ప్రాంతమంతా ప్రయాణం చేయలేని స్థితిలో ఉందని సమాచారం అందుకున్న పోలీసు యంత్రాంగం హెలికాప్టర్ సహాయంతో వారిని వాజేడు మండలం మండపాక గ్రామంలోని సురక్షిత ప్రాంతానికి తరలించింది. ఎన్‌కౌంటర్ ఘటనలో గాయపడ్డ వారికి గ్రామంలోనే వైద్య చికిత్సలు నిర్వహిస్తున్నారు. తీవ్ర గాయాల పాలైన పలువురిని మెరుగైన వైద్యం కోసం ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించారు.



# రేపు అసెంబ్లీకి కేసీఆర్?

- ఎన్నికల అనంతరం మొదటిసారి..
- బీఆర్‌ఎస్‌ఎల్పీ సమావేశం!

ప్రజాస్వరం, హైదరాబాద్:

బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు హాజరు కానున్నట్లు సమాచారం. బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కేసీఆర్ అసెంబ్లీకి రాబోతున్నారు. కేసీఆర్ ప్రధాన ప్రతిపక్ష నేత అయినప్పటికీ వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు అసెంబ్లీకి హాజరుకాలేదు. పార్లమెంటు ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ.. తాను అసెంబ్లీకి వెళ్తానని.. తన ప్రళయగర్జన అక్కడ చూస్తారంటూ వ్యాఖ్యానించారు. కాగా తాజాగా కేసీఆర్ అసెంబ్లీకి రానుండటం గమనార్హం. కేసీఆర్ తొలిసారి అసెంబ్లీ సమావేశాలకు రాబోతుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. మరోవైపు ఆయన ఏం మాట్లాడనున్నారన్నది కూడా ఇంట్రెస్టింగ్ గా మారింది. ఇటీవల వరసగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.



# ఇది అరాచక పాలన

- అసెంబ్లీ ఎదుట నల్ల బ్యాడ్జీలతో వైసీపీ ఆందోళన
- పోస్టర్లు చించివేసిన పోలీసులు
- ఖాకీల తీరుపై వైయస్ జగన్ ఆగ్రహం

ప్రజాస్వరం, ఏపీ బ్యూరో :

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని మాజీ సీఎం వైయస్ జగన్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని ఆయన పేర్కొన్నారు. ఏపీ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతి భద్రతల వైఫల్యంపై ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వైసీపీ నేతలు నల్ల బ్యాడ్జీలతో అసెంబ్లీకి తరలివచ్చారు. సేవ్ డెమోక్రసీ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు, పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో వారిని పోలీసులు గేటు వద్ద అడ్డుకున్నారు. అసెంబ్లీ ఎదుట ప్లకార్డులు ప్రదర్శించొద్దంటూ వాగ్వాదానికి దిగారు. పోస్టర్లను లాక్కుని చించేశారు. దీంతో పోలీసులపై జగన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టర్లు గుంజుకొని చించే హక్కు మీకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, పోలీసుల వైఖరి అత్యంత దారుణంగా ఉందని వెల్లడించారు. పోలీసులు ఉన్నది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం కోసం కాదని చెప్పారు. పోలీసుల జులుం ఎల్లకాలం సాగబోదని, ఈ విషయాన్ని పోలీసులు గుర్తుపెట్టుకోవాలంటూ హెచ్చరించారు. ఈ క్రమంలో అసెంబ్లీ గేటు వద్ద కాసేపు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది.

# వర్షాలు సమృద్ధిగా కురస్తాయి

- నగరంలో ఘనంగా ఉజ్జయిని మహాకాళి బోనాలు
- భవిష్యవాణి వినిపించిన స్వర్ణలత

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో :

ఉజ్జయిని మహాకాళి బోనాల వేడుకలో భాగంగా భక్తురాలు స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మట్టి బోనమైనా, స్వర్ణ బోనమైనా.. ఎవరు తీసుకొచ్చినా తాను సంతోషంగా అందుకుంటానని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని తెలిపారు. వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడతానన్నారు. ప్రజలను చల్లగా చూస్తానని చెప్పారు. 'పిల్లలు, పెద్దలు, జంతువులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను. నేను సంతోషంగా ఉండటానికి చల్లని శాక పెడుతున్నారు. ఈసారి కూడా 5 వారాలు పప్పు బెల్లాలతో శాక పెట్టండి. పాడి పంటలు గతంలో లాగా పండించడం లేదు. రసాయనాలు ఎక్కువ వాడుతున్నారు. అందుకే అనారోగ్యం. వాటిని తగ్గించుకుంటే మీకు వ్యాధులు తగ్గుతాయి' అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# గోదావరి ఉగ్రరూపం



- రెండో ప్రమాద హెచ్చరిక దాటే చాన్స్
- జలదిగ్బంధంలో సున్నంభట్టి, కాశీనగరం గ్రామాలు

ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో:

గోదారి మహోగ్రంగా ప్రవహిస్తోంది. రెండో ప్రమాద హెచ్చరిక కూడా దాటే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో మొదటి ప్రమాద హెచ్చరికను దాటి ఉరుకులు పెడుతున్నది. సోమవారం ఉదయం 46.80 అడుగులకు చేరింది. మరో రెండు అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక జారీచేయనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఆదివారం రాత్రి భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం 44 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఎగువన ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నది ఉగ్రరూపం దాల్చింది. సోమవారం నదీ ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు వెల్లడించారు.ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పుష్కర ఘాట్ వద్ద గోదారమ్మ మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తున్నది. మొదటి ప్రమాద హెచ్చరిక 14.830 మీటర్లు కాగా, ప్రస్తుతం 15.130 మీటర్లు వుంది. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రతగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి ప్రాజెక్టులో భారీగా వరదనీరు చేరడంతో సున్నంబట్టి, కాశీనగరం గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. దీంతో అధికారులు అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

# స్మిత వ్యాఖ్యలపై దుమారం

**వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్**
**దివ్యాంగులను అవమానించారని ఆగ్రహం**

హైదరాబాద్,జూలై22(ప్రజాస్వరం):

సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారణి స్మితా సబర్వాల్ చేసి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా దుమారం రేగుతోంది. స్మిత వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. తాజాగా... ప్రముఖ మోటివేటర్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమి నిర్వాహకురాలు బాలలత స్పందిస్తూ స్మితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగవైకల్యం ఉన్నవారి గురించి మాట్లాడటానికి స్మిత సబర్వాల్‌కు ఉన్న అర్హత ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జ్యుడిషియరీ, పార్లమెంటరీ వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు ఫీల్డ్‌లో పరిగెత్తుతూ స్మిత సబర్వాల్ ఎంతకాలం పనిచేశారని నిలదీశారు. వివక్షకు గురవుతున్న వికలాంగులను స్మిత సబర్వాల్ మాటలు మరింత కుంగదీశాయన్నారు. సీఎం అయ్యాక రేవంత్ రెడ్డి మొదట అపాయింట్‌మెంట్ వికలాంగురాలికి ఇచ్చారని గుర్తు చేశారు. స్మిత తన మాటలు వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారా? లేక ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నారా అనేది తెల్చాలన్నారు. కోడ్ ఆఫ్ కండెక్ట్, సివిల్ సర్వేంట్ క్రమశిక్షణ రాహిత్యం కింద స్మిత సబర్వాల్‌పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగవైకల్యం ఉన్న జై పాల్ రెడ్డి ఉత్తమ పార్లమెంటరీ సాధించారని తెలిపారు. స్మిత సబర్వాల్‌పైన చర్యలు తీసుకోవాలి అని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. 'ఇప్పటికైనా సివిల్స్ పరీక్ష రాస్తాను.. నాకన్నా ఎక్కువ మార్కులు సాధించమని స్మిత సబర్వాల్' సవాల్ విసిరారు. స్టీఫిన్ హాకింగ్, సుదా చంద్రన్ వంటి మేధావులు అంగవైకల్యం జయించారన్నారు. కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు సీఎంవోలో పనిచేసి కనీసం అడ్మినిస్ట్రేషన్‌పైన అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకారమన్నారు. అంగవైకల్యంతో పద్మశ్రీ, పద్మ భూషన్ అవార్డులు తీసుకున్నవారు ఉన్నారన్నారు. 24 గంటల్లో స్మిత సభర్వాల్ తన మాటలు వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. రేపటిలోగా ప్రభుత్వం ఈ అంశంపైన స్పందించకపోతే టాంక్ బండ్‌పైన నిరసన తెలియజేస్తామని బాలలత స్పష్టం చేశారు. 'ఐఏఎస్, ఐపీఎస్ వంటి సివిల్ సర్వీసు ఉద్యోగాలకు ఎక్కువగా క్షేత్ర స్థాయిలో పని చేయాల్సి ఉంటుంది.. ప్రజల కష్టాలను నేరుగా వినాల్సి ఉంటుంది.. ఇందుకు శారీరక దృఢత్వం, అవసరం.. కొన్నిసార్లు కఠిన సమయాల్లో పని చేయాల్సి ఉంటుంది.. వైకల్యం ఉన్న వారిని గౌరవిస్తున్నాను... కానీ వైకల్యం ఉన్న ÷లైట్‌ను విమానయాన సంస్థలు నియమించుకుంటాయా? వైకల్యం ఉన్న సర్జన్ సేవలను మీరు విశ్వసిస్తారా?' అంటూ ఐఏఎస్ అధికారిని స్మితసబర్వాల్ ట్వీట్ చేశారు. అయితే దివ్యాంగులపై స్మిత వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతం

**2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించే లక్ష్యం**
**కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే వ్యాధులకు కారణం**
**అంచనా వేసిన ఆర్థిక సర్వే..పార్లమెంట్‌కు సమర్పణ**



న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):

కేంద్ర బడ్జెట్ 2024..ప్రవేశపెట్టే ముందు.. ఆర్థిక సర్వేను పార్లమెంట్ లో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశ పెట్టారు. తేదీ లోక్ సభలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చాలా కీలకమైన అంశాలు ఉన్నాయి. దేశ ఆర్థిక వృద్ధి 6.5 నుంచి 7 శాతంగా ఉంటుందని అంచనా. మార్కెట్ అంచనాలు చాలా ఎక్కువగా ఉన్నాయని.. అందుకు తగ్గట్టుగా రిస్క్ ఎక్కువగా ఉంటుందని.. అయినా వృద్ధి రేటును కొనసాగుతుందని ఆర్థిక మంత్రి స్పష్టం చేశారు. ద్రవ్యోల్బణం.. ధరల సూచి 4.5 శాతంగా ఉంటుందని.. 2026 నాటికి ధరల సూచిని 4.1 శాతానికి తగ్గించటమే లక్ష్యంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. దేశంలోని ప్రజలు 54 శాతం వ్యాధులు, రోగాలకు కల్తీ, అనారోగ్యకరమైన ఆహారమే కారణం అని.. ఈ విషయంలో మార్పు అవసరం అని ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. సమతుల్యమైన ఆహారం, నాణ్యమైన ఆహారం వైపు మార్పు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆర్థిక సర్వే చెబుతోంది. చైనా నుంచి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు భారీగా పెరిగినట్లు ఆర్థిక సర్వే వెల్లడించింది. దీని వల్ల దేశం నుంచి ఇతర దేశాలకు ఎగుమతులు పెంచటానికి ఈ పెట్టుబడులు ఎంతో ఉపయోగపడతాయని స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్..ప్రభావం ఉద్యోగులు, కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. పప్పు ధాన్యాల లోటు కొనసాగటం వల్ల.. దిగుమతులు తప్పవు అనేది స్పష్టం చేసింది ఆర్థిక సర్వే. దేశంలోని బ్యాంకింగ్, ఆర్థిక రంగాలు అద్భుతమైన పనితీరు చూపించటంతో.. ఆర్థిక ఒడుదుడుకులను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లు ఆర్థిక సర్వే స్పష్టం చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభాలు, దేశంలోని క్లిష్టమైన ఆర్థిక రంగాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే స్థానిక ఉత్పత్తులు, వినియోగం ద్వారానే అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడింది ఆర్థిక సర్వే. దీంతో పాటు గణాంక అనుబంధాన్ని కూడా సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనమిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అఫైర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనమిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్‌తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ఒక రోజు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. అంతర్జాతీయ భౌగోళిక పరిణామాలు, వాటి ప్రభావం ఆర్‌బీఐ ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రభావితం చేయొచ్చు. ఈ ఏడాది సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కార్పొరేట్, బ్యాంకింగ్ బ్యాలెన్స్ షీట్స్ బలంగా ఉన్నాయి. ప్రైవేటు పెట్టుబడుల వృద్ధికి ఇది దోహదం చేస్తుంది. భారత వృద్ధిలో క్యాపిటల్ మార్కెట్‌లది కీలకపాత్ర. భౌగోళిక రాజకీయ, ఆర్థిక పరిణామాలను తట్టుకోలదని ఆర్థిక సర్వే అభిప్రాయం.

# ప్రజల సమస్యలు వదిలి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి

**బాబాయ్ హత్యపై ఎందుకు ధర్నా చేయలేదు**
**ప్రజలంతా నీట మునిగి అవస్థ పడుతుంటే ఇదేం పద్ధతి**
**జగన్ తీరుపై మండిపడ్డ పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల**

అమరావతి,జూలై22(ప్రజాస్వరం):

వైసీపీ అధినేత జగన్ హత్యా రాజకీయాలు చేశారని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. సొంత చెల్లెళ్లకు జగన్ వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. బాబాయి హత్యపై ఢిల్లీలో ఎందుకు ధర్నా చేయలేదని ప్రశ్నించారు. వివేకా హంతకులతో జగన్ కలిసి తిరుగుతున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో ఉండకుండా జగన్ ఏం చేస్తారని ప్రశ్నించారు. వినుకొండ హత్య వ్యక్తిగత హత్యేనని.. రాజకీయమైంది కాదన్నారు. వినుకొండలో జరిగిన హత్యకు కారణం వ్యక్తిగత కక్షలేనని పోలీసులు కూడా తేల్చేశారని షర్మిల గుర్తుచేశారు. హతుడు, హంతకుడు ఇద్దరూ నిన్నమొన్నటి వరకు వైసీపీతోనే ఉన్నారని గుర్తుచేస్తూ.. ఇది రాజకీయ హత్య ఎలా అవుతుందని నిలదీశారు. ఓవైపు రాష్ట్రంలో భారీ వర్షాలకు చాలా మంది జనం వరదల్లో చిక్కుకున్నారని, ఇల్లూ వాకిలీ నీట మునగడంతో దిక్కుతోచక రోదిస్తున్నారని షర్మిల చెప్పారు. వారిని పరామర్శించి ధైర్యం చెప్పాలని అనిపించడం లేదా? అంటూ జగన్ ను ప్రశ్నించారు. 'కేవలం మీ పార్టీ వాళ్లు ఓటు వేస్తేనే మీరు గెలిచారా? ఐదేళ్లు ప్రజల కోసం పనిచేయలేదు కానీ ఇప్పుడు ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తారంట.. అంటూ జగన్ పై షర్మిల తీవ్ర విమర్శలు చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వంపై మాట్లాడిన షర్మిల బీజేపీ ఆంధ్రప్రదేశ్ పై సవతి తల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. అలాంటి బీజేపీతో చంద్రబాబు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఆంధప్రదేశ్? లో కురిసిన వర్షాలకు రైతన్నలు తీవ్రంగా నష్టపోయారని.. ప్రతి రైతుకు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్? చేశారు. పక్క రాష్ట్రమైన తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 2 లక్షల రుణమాఫీ అమలు చేసిందని... ఆంధ్రప్రదేశ్ లో కూడా అమలు చేయాలన్నారు. - ఇప్పటికే రాష్ట్రంలో రైతులు చితికి పోయారన్నారు. - జగన్ సర్కార్ లో రైతులు చితికి పోయారంటూ.. వైఎస్ ఉన్నప్పుడు వ్యవసాయం రైతులకు పండుగగా ఉందని ..- రైతుకు వైఎస్‌ఆర్ పెద్ద పీట వేశారని అన్నారు. వైఎస్ తలపెట్టిన జలయజ్ఞం జగన్ విస్మరించారు..- ప్రాజెక్టు కట్టకపోగా ఉన్నవాటికి మరమత్తులు లేవు.. - సబ్సిడీ పథకాలను మొత్తం జగన్ ఎత్తేశాడని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. - ఏపిలో కూడా కాంగ్రెస్ అధికారంలో వచ్చి ఉంటే 2 లక్షల రుణమాఫీ చేసే వాళ్ళమని షర్మిల అన్నారు. తెలంగాణలో 40 లక్షల మంది రైతులు రుణ విముక్తులు అయ్యారు - వైఎస్ అమలు చేసినట్లే రేవంత్ రెడ్డి రుణమాఫీ అమలు చేశాడు - ఇక్కడ ఎందుకు అమలు చేయరు అని చంద్రబాబును ప్రశ్నించారు. ఏపి నుంచి 25 మంది ఎంపీలు ఉన్నారు. అందరు బీజేపీకి మద్దతు ఇచ్చినా... ప్రయోజనం శూన్యమన్నారు. అసెంబ్లీ సమావేశాలు ఎగ్గొట్టేందుకే జగన్ ఢిల్లీకి వెళుతున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో ఏపీకి ప్రత్యేక హోదా కోసం ఎన్నిసార్లు ఢిల్లీలో ధర్నా చేశారని నిలదీశారు. ఏపీకి ప్రత్యేక హోదా అంశాన్ని బీజేపీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడలేకపోయారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టును, కడప, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలను పట్టించుకోలేదు, మూడు రాజధానుల పేరుతో ప్రజలను గందరగోళానికి గురిచేశారు. వీటన్నిటిపై ఏనాడూ ధర్నా చేయలేదు కానీ మీ పార్టీ కార్యకర్త చనిపోతే ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తారా? అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాకుండా తప్పించుకునేందుకే ఈ ఎత్తు వేశారు. మీ పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నదే 11 మంది, ఉన్న ఆ కొద్దిమందైనా అసెంబ్లీలో చర్చలో పాల్గొనరా? ప్రజావ్యతిరేక బిల్లులపై పాలకపక్షంతో కొట్లాడే అవసరం మీకు లేదనుకుంటున్నారాఅంటూ జగన్ ను షర్మిల నిలదీశారు.



# యాక్సిడెంట్ కాదు...ఇన్సిడెంట్

**పూర్తిస్థాయి విచారణ జరుగుతోంది**
**అవసరమైతే కేసు సిఐడికి అప్పగింత**
**మదనపల్లె ఘటనపై డిజిపి**

మదనపల్లె,జూలై22(ప్రజాస్వరం):



అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఘటన ప్రమాదం కాదని, ఇన్సిడెంట్‌గా అనిపిస్తోందని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావు అన్నారు. ఇందులో నిజాలు వెలికి వస్తాయని, కావాలని చేసిన పనిగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఆయన సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని, ఘటనపై ఆరా తీశారు. అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత రాత్రి సుమారు 11.30 గంటలకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. 3 గంటల పాటు పరిశీలించిన తర్వాత అది యాక్సిడెంట్ కాదు.. ఇన్సిడెంట్‌గా భావిస్తున్నాం. 22ఏ భూముల రికార్డులున్న గదిలో ఫైర్ ఇన్సిడెంట్ జరిగింది. కీలక దస్త్రాలున్న విభాగంలో ఈ ఘటన చోటుచేసుకోవడం అనుమానాలకు తావిస్తోంది. ఘటన సమాచారం ఆర్డీవోకు తెలిసింది కానీ, కలెక్టర్‌కు సమాచారం ఇవ్వలేదు. ఘటన విషయం తెలుసుకున్న సీఐ కూడా ఎస్పీ, డీఎస్పీలకు సమాచారం ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారుల అలసత్వం కనిపిస్తోంది. కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ జరిగేందుకు అవకాశమే లేదని విచారణలో తేలింది. ఇక్కడ వోల్టేజ్ తేడాలు లేవని అధికారులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని ఫోరెన్సిక్ వాళ్లు కూడా చెప్పారు. సబ్ కలెక్టర్ కార్యాలయం కిటికీ బయట అగ్గిపుల్లలు కనిపించాయి. కార్యాలయం బయట కూడా కొన్ని ÷ళ్లు కాలిపోయాయి. ఇవన్నీ అనుమానాలను మరింత పెంచుతున్నాయి. ఇటీవల సాక్ష్యాలను నాశనం చేసే ఘటనలు కొన్ని జరిగాయి. ఈ నేపథ్యంలో ఆ దిశగానూ దర్యాప్తు ప్రారంభించాం. కేసు దర్యాప్తునకు 10 బృందాలను ఏర్పాటు చేశాం. కేసు సీఐడీకి బదిలీ చేసే అంశంపై మంగళవారం లేదా బుధవారం నిర్ణయం తీసుకుంటాం. యాక్సిడెంట్ కాదు.. కుట్రో కాదో విచారణలో తేలుస్తాం అని డిజిపి తెలిపారు. దీనిపై ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందన్న ఆయన.. పోలీసు శాఖ కూడా దీనిని తీవ్రంగా పరిగణిస్తోందని చెప్పారు. ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు అందించాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో రన్నింగ్ ఫైల్స్ దగ్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 25 అంశాలకు సంబంధించిన దస్త్రాలు దగ్ధమయ్యాయన్నారు. ఈ 25 అంశాల్లో చుక్కల భూములు, నిషేధిత భూములు ఉన్నట్లు తెలిపారు. కాలిపోయిన ÷ళ్లు ఏంటో గుర్తించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని, షార్ట్ సర్క్యూట్ కానప్పుడు ఘటన ఎలా జరిగిందనేది తేలాల్సి ఉందని చెప్పారు.

# కావడి యాత్ర ముందు దుకాణాలపై పేర్లు

**ఉత్తరాఖండ్, యూపి ప్రభుత్వ ఆదేశాలపై స్టే**
**రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ప్రకటించిన సుప్రీం**

న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):

కావడి యాత్ర మార్గంలోని హోటళ్లు, తోపుడుబండ్ల ముందు వాటి యజమానులు, సిబ్బంది పేర్లు పెట్టాలంటూ ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు సోమవారంనాడు 'మధ్యంతర స్టే' ఇచ్చింది. అత్యున్నత న్యాయస్థానం నిర్ణయంపై విపక్షాలు హర్షం వ్యక్తం చేయగా, బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కీలక భాగస్వామి జనతాదళ్ యూనైటెడ్ సైతం తీర్పును స్వాగతించింది. యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వ ఆదేశాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, తినుబండారాల విక్రేతలు తమ దుకాణాల వద్ద యజమానులు, ఉద్యోగుల పేర్లు ప్రదర్శించాలంటూ బలవంతం చేయరాదని న్యాయమూర్తులు జస్టిస్ హృషికేష్ రాయ్, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని యూపీ, ఉత్తరాఖండ్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను జేడీయూ ప్రతినిధి కేసీ త్యాగి స్వాగతించారు. సమాజాన్ని విడగొట్టేలా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయనే ఆందోళనలు తమకు ఉన్నాయన్నారు. ఈ విజయాన్ని సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాలను స్వాగతిస్తున్నట్టు కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేర చెప్పారు. యోగి సర్కార్ ఇచ్చిన ఆదేశాలు రాజ్యాంగ వ్యతిరేకమని కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీ మొత్తం చెప్పాయని, ప్రధాని మంత్రి ఇప్పటికైనా తమ ముఖ్యమంత్రులకు 'రాజధర్మం' గురించి వివరించి, ఇలాంటి రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడకుండా చూస్తారని ఆశిస్తున్నామని అన్నారు. శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పును తమ పార్టీ స్వాగతిస్తోందని, అధికార బీజేపీ ఈ తరహా దిగజారుడు రాజకీయాలు జరుపుతోందని అన్నారు

# తుంగభద్ర డ్యాంకు పోటెత్తిన వరద

**మూడు గేట్లు ఎత్తి కిందికి నీటి విడుదల**

జోగులాంబ గద్వాల,జూలై22(ప్రజాస్వరం):

కర్ణాటకలోని తుంగభద్ర డ్యాంకు వరద పోటెత్తింది. దీంతో ప్రాజెక్టు 3 గేట్లను అధికారులు ఎత్తేశారు. ఎగువ నుంచి భారీగా వరద పరవళ్లు తొక్కుతుండటంతో ముందస్తుగా సోమవారం సాయంత్రం 3 గేట్లు ఎత్తి వరద నీటిని తుంగభద్ర నదిలోకి విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యాంకు 1,01,993 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. అవుట్ ఫ్లో 7,744 క్యూసెక్కులు నమోదైంది. ప్రస్తుతం డ్యాంలో 87.056 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. 1628.09 అడుగుల మేర నీటి మట్టం ఉన్నట్లు టీబీ డ్యాం అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1633 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1628.09 అడుగులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. భారీ వరద నేపథ్యంలో ప్రాజెక్టు పరివాహక ప్రాంతంలో ఉండే ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రాజెక్టు దిగువన ఉండే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. తుంగభద్ర డ్యాం గేట్లు తెరవడంతో.. కృష్ణా నదిలోకి వరద పోటెత్తింది. దిగువన ఉన్న శ్రీశైలంకు కృష్ణమ్మ పరుగులు పెడుతోంది.

# బడ్జెట్ ప్రవేశంలో నిర్మల చరిత్ర

**అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత**
**మరోమారు ఎవ్వరికీ అందనంతగా రికార్డు**

న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న మంగళవారం మరోమారు పార్లమెంట్‌లో 2024-25 బడ్జెట్ ను ప్రవేశపెట్టబోతున్నారు. మోదీ 3.0 సర్కారులో ఆమె ప్రవేశపెడుతున్న మొదటి బడ్జెట్ కాగా, ఆమె మొత్తంగా ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టిన ఆర్థికమంత్రి, మహిళా మంత్రిగా చరిత్ర సృష్టించబోతున్నారు. గతంలో ఉన్న రికార్డులను తిరగరాయబోతున్నారు. మొత్తంగా చూస్తే ఆమె ప్రవేశపెడుతున్న ఏడో కేంద్ర బడ్జెట్ ద్వారా తన పేరును చరిత్రలో లిఖించుకో బోతున్నారు. ఇప్పటికే నిర్మలా సీతారామన్ కేంద్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఐదు పూర్తిస్థాయి బడ్జెట్ లు సమర్పించగా.. ఫిబ్రవరి 1న మధ్యంతర బడ్జెట్ ను ప్రవేశపెట్టారు.. ఇప్పుడు ఆరోసారి పూర్తిస్థాయి బ్జడెట్ ను ప్రవేశబెట్టి.. మరో రికార్డును తిరగరాయనున్నారు. ఇంతకుముందు వరుసగా ఐదు కేంద్ర బడ్జెట్లు ప్రవేశపెట్టిన మొరార్జీ దేశాయ్, అరుణ్‌జైట్లీ, పి.చిదంబరం, యశ్వంత్‌సిన్హా, మన్మోహన్‌సింగ్‌ను ఆమె అధిగమించనున్నారు. 1959 నుంచి 1964 వరకు ఆర్థిక మంత్రిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఐదుమార్లు పూర్తి బడ్జెట్లు, ఒక మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టారు. మొత్తంగా మొరార్జీ దేశాయ్ అత్యధికసార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. ఇన్నాళ్లు అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన రికార్డు మొరార్జీ దేశాయ్ పేరు మీదే ఉంది. దీనిని ఎవ్వరూ బ్రేక్ చేయలేదు.. అయితే.. తాజా బడ్జెట్ తో నిర్మలా సీతారామన్ వరుసగా ఆరుసార్లు పూర్తి స్థాయిలో బడ్జెట్ ప్రవేశపెట్టి అరుదైన ఘనతను సాధించబోతున్నారు. వాస్తవానికి ఇందిరా గాంధీ తర్వాత బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండో మహిళ నిర్మలా సీతారామన్.. ప్రధాని హోదాలో ఉంటూ నాడు ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. స్వతంత్ర భారతదేశంలో తొలి పూర్తిస్థాయి మహిళా ఆర్థిక మంత్రిగా ఎక్కువ కాలం కొనసాగిన నేతగా నిర్మలా సీతారామన్ ఇప్పటికే రికార్డును నమోదు చేసుకున్నారు.వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టడంలోనూ నిర్మల సీతారామన్ కొత్త పోకడలు తీసుకొచ్చారు. సంప్రదాయ బ్రీఫ్‌కేస్ విధానానికి ఆమె మంగళం పాడారు. జాతీయ చిహ్నంతో కూడిన ఖాతా పుస్తకం తరహాలో ఉండే బ్యాగులో ఆమె బ్జడెట్ పత్రాలు తీసుకొచ్చే సంప్రదాయానికి ఆమె శ్రీకారం చుట్టారు. 2019లో తొలి బ్జడెట్ నుంచి ఆమె ఖాతా బుక్ విధానాన్ని అనుసరిస్తున్నారు. ఇప్పటి వరకు అతి సుదీర్ఘ బ్జడెట్ ప్రసంగం రికార్డు, అతి స్వల్ప ప్రసంగం రికార్డు కూడా నిర్మలా సీతారామన్ పేరిటే ఉన్నాయి. 2020లో ఆమె చేసిన బడ్జెట్ ప్రసంగం రెండు గంటల 40 నిమిషాలు సాగింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో తాత్కాలిక బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో ఆమె చేసిన 57 నిమిషాల ప్రసంగం ఇప్పటి వరకు చేసిన ప్రసంగాల్లో అత్యల్పమైనది. నిర్మలా సీతారామన్.. 2019లో రెండోసారి మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి ఆమెను కొనసాగుతున్నారు. మోదీ త్రీ పాయింట్ ఓ లో మొత్తం ఐదేళ్ల కాలానికి ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ కొనసాగితే అది కూడా ఒక రికార్డవుతుంది.. ప్రస్తుతం నిర్మలా సీతారామన్ కర్ణాటక నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి రూ.పది వేల కోట్లుఇవ్వండి





**జల్ జీవన్ మిషన్ నిధులు విడుదల చేయండి..**
**గ్యాస్ సబ్సిడీ ఓఎంసీలకు ముందుగానే చెల్లించండి**
**పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి..**
**కేంద్ర మంత్రులు సీఆర్ పాటిల్, హర్‌దీప్ సింగ్ పూరీ, జోషిలకు సిఎం రేవంత్ వినతి**

**న్యూఢిల్లీ,జూలై22(ప్రజాస్వరం):**

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద రూ.పది వేల కోట్లు కేటాయించాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న మూసీ నదిని దేశంలో మరెక్కడ లేని విధంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి వివరించారు. ఢిల్లీలో కేంద్ర మంత్రులు సి.ఆర్.పాటిల్, హర్ దీప్ సింగ్ పూరీ, ప్రహ్లాద్ జోషిలను ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలను వారి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలోని మురికి నీరు అంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని జలశక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీలో చేరే మురికి నీరును శుద్ధి చేయడం, వరద నీటి కాల్వల నిర్మాణం, స్థాయి పెంపు, మూసీ సుందరీకరణకు సహకరించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. జాతీయ నది పరిరక్షణ ప్రణాళిక కింద దక్షిణ పీఠభూమిలోని నదుల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్రం యోచిస్తున్నందున మూసీలో కలిసే మురికి నీటి శుద్ధి పనులకు రూ.4 వేల కోట్లు కేటాయించాలని కోరారు. గోదావరి జలాలను ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లతో నింపేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టులకు రూ.6 వేల కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ రెండు చెరువులను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్ నీటి ఇబ్బందులు తీరడంతో పాటు మూసీ నది పునరుజ్జీవనానికి తోడ్పడుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. జల్ జీవన్ మిషన్ కింద తెలంగాణకు నిధులు విడుదల చేయాలని జల్‌శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2019 లెక్కల ప్రకారం జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రంలో 77.60 శాతం ఇళ్లకు నల్లా నీరు అందుతోందని, ఇటీవల తాము చేపట్టిన సర్వేలో 7.85 లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని తేలిందని వివరించారు. ఆ ఇళ్లతో పాటు పీఎంఏవై (అర్బన్), (రూరల్) కింద చేపట్టే ఇళ్లకు నల్లా కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, ఇందుకు మొత్తంగా రూ.16,100 కోట్లు అవసరమవుతాయని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. 2019లో జల్‌జీవన్ మిషన్ ప్రారంభించినా నేటి వరకు రాష్ట్రానికి నిధులు ఇవ్వలేదని, ఈ ఏడాది నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రిని కోరారు. తెలంగాణలో రూ.500కే గ్యాస్ సరఫరాకు సంబంధించిన సబ్సిడీని ముందుగానే ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలకు (ఓఎంసీ) చెల్లించే సదుపాయాన్ని కల్పించాలని పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి పూరీని పార్లమెంట్‌లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా తమ ప్రభుత్వం రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. తాము ముందుగానే సబ్సిడీ చెల్లిస్తామని.. రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేయాలని గ్యాస్ ఏజెన్సీలను గతంలోనే కోరినా సానుకూలత వ్యక్తం కాలేదన్నారు. ప్రస్తుతం వినియోగదారులు సిలెండర్‌కు పూర్తిగా డబ్బులు చెల్లించిన తర్వాత సబ్సిడీ అందుతుండడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్యాస్ సిలిండర్లకు చెందిన సబ్సిడీని ముందుగానే ఓఎంసీలకు చెల్లించేందుకు అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే వినియోగదారులు రూ.500 చెల్లించి సిలిండర్ తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. ముందుగానే రాయితీని తాము ఓఎంసీలకు చెల్లిస్తున్నందున ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. అలా వీలుకాని పక్షంలో వినియోగదారులకు తమ ప్రభుత్వం చెల్లించే సబ్సిడీని 48 గంటల్లోపు అందేలా చూడాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.ధాన్యం సేకరణ, బియ్యం సరఫరాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ నుంచి రావల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి సోమవారం కలిశారు. 2014-15 ఖరీఫ్ కాలంలో అదనపు లెవీ సేకరణకు సంబంధించి రూ. 1468.94 కోట్ల రాయితీని పెండింగ్‌లో పెట్టారని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి తెలియజేశారు. అందుకు సంబంధించిన అన్ని పత్రాలను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని గుర్తు చేశారు. అందువలన బకాయిపడిన ఆ మొత్తాన్ని విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన 89,987.730 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన ఉత్తర్వులను ధ్రువీకరించుకొని అందుకు సంబంధించిన బకాయిలు రూ.343.27 కోట్లను విడుదల చేయాలని కేంద్ర మంత్రి పూరీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే 2021 మే నుంచి 2022 మార్చి వరకు నాన్ ఎన్ఎఫ్ఎస్ఎ (నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్) కింద పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఖమ్మం, జహీరాబాద్ ఎంపీలు రామసహాయం రఘురామిరెడ్డి, సురేష్ షెట్కార్, ముఖ్యమంత్రి కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

## రసవత్తరంగా అమెరికా అధ్యక్ష ఎన్నికలు

**బరిలోంచి తప్పకుంటున్నట్లు బైడెన్ ప్రకటన**
**కమలా హారిస్‌కు మద్దతు తెలిపిన అధ్యక్షుడు జోబైడెన్**
**తొలిసారి రేసులో భారత సంతతి అమెరికా మహిళ**
**బైడెన్ తప్పకోవడాన్ని స్వాగతించిన ఒబామా**
**అనూహ్యంగా మిషెల్ ఒబామా పేరు తెరపైకి రాక**



**న్యూయార్క్,జూలై22(ప్రజాస్వరం):**

అమెరికా అధ్యక్ష ఎన్నికలు ఆసక్తికరంగ ఆమారబోతున్నాయి. ట్రంప్‌కు పోటీగా మారోమారు బరిలిలో నిలవాలనుకున్న ప్రస్తు అధ్యక్షుడు జో బైడెన్ బరినుంచి తప్పుకున్నారు. తన మద్దతును ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు ప్రకటించారు. అనూహ్యంగా ఇప్పుడు తెరపైకి మాజీ అధ్యక్షుడు ఒబామా సతీమణి మిషెల్ ఒబామా పేరు కూడా వచ్చింది. భారతీయ మూలాలున్న కమలా హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచినట్లు వార్తు రావడం, మిషెల్ కూడా రంగంలోకి వచ్చినట్లు తేలడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారాయి. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ 2024 అధ్యక్ష రేసు నుంచి వైదొలగాలని నిర్ణయించగా, వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్‌కి తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. 81 ఏళ్ల బైడెన్ వయోభారంతో, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. దేశ ప్రయోజనాల కోసం తాను పోటీ నుంచి తప్పు కొంటున్నట్లు ప్రకటించారు. డెమొక్రాట్ల సీనియర్ల ఒత్తిడిని గౌరవిస్తున్నట్లు వ్యాఖ్యానిం చారు. అయితే డెమొక్రాట్ల నుంచి కమలా హారిస్‌కే అనూహ్యమైన మద్దతు లభిస్తోంది. కాలిఫోర్నియాలోని జమైకా-అమెరికన్ ప్రొఫెసర్ డోనాల్డ్ జె హారిస్, తమిళ జీవశాస్త్రవేత్త శ్యామాల గోపాలన్ దంపతులకు కమలా దేవి హారిస్1964 అక్టోబర్ 20న జన్మించారు. కమలా హారిస్ భారత సంతతి మహిళగా గుర్తింపు పొందారు. అయితే ఆమె తల్లిదండ్రులు కొన్నాళ్లకే విడాకులు తీసుకున్నారు. అనంతరం కమలా తన తల్లితో కలిసి జీవిస్తున్నారు. ఆమె తన బ్యాచిలర్ డిగ్రీ కోసం చారిత్రాత్మక ఆల్ బ్లాక్ కళాశాల అయిన హోవార్డ్ విశ్వవిద్యాలయానికి వెళ్లారు. కమలా హారిస్ పొలిటికల్ సైన్స్, ఆర్థికశాస్త్రంలో డిగ్రీ పట్టా పొందారు. అనంతరం న్యాయశాస్త్రంలో చేరారు. 1990 లో బార్ అసోసియేషన్ సభ్యురాలిగా మారి, అదే ఏడాది కాలిఫోర్నియాలో డిప్యూటీ డిస్ట్రిక్ట్ అటార్నీగా వృత్తిని ప్రారంభించారు. 2003లో శాన్?ఫ్రాన్సిస్కో డిస్ట్రిక్ట్ అటార్నీగా ఎన్నికయ్యారు. 2007 చివరలో, అప్పటికే జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఒకసారి, 2014లో మరోసారి అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. 2017లో ఆమె తన స్వరాష్ట్రం నుంచి జూనియర్ యూఎస్ సెనేటర్ అయ్యారు. ఆరోగ్య సంస్కరణలు, పన్ను,వలసదారులకు పౌరసత్వం, తుపాకీ

నియంత్రణ చట్టాల మీద ప్రచారాలతో ఆమె పేరు ప్రపంచ వ్యాప్తంగా ఒక్కసారిగా మార్మోగిపోయింది. సెనేట్‌లో పనిచేసిన రెండో ఆఫ్రికన్ అమెరికన్, తొలి ఆగ్నేయాసియా మహిళగా గుర్తింపు పొందారు. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో నిలిచిన కమలా హారిస్, జో బైడెన్‌కు మద్దతుగా రేసు నుంచి తప్పుకున్నారు. అనంతరం ఆయన పాలనలో వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా అమెరికా అధ్యక్ష బరిలో దిగుతున్నారు. ఆగస్ట్‌లో జరగనున్న ఈవెంట్‌లో డెమొక్రాట్లు తమ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోనున్నారు. ఈ నామినేషన్‌లో గెలిస్తే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న తొలి భారత సంతతి మహిళగా కమలా హారిస్ చరిత్ర సృష్టిస్తారు.అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధిస్తే, దేశానికి మొదటి భారతీయ సంతతి మహిళ అధ్యక్షురాలు కాగలరు. 'అమెరికా అధ్యక్ష రేసులో నిలిచేందుకు అధ్యక్షుడి ఆమోదం పొందడం గౌరవంగా ఉంది,' అని కమలా పేర్కొన్నారు. జో బైడెన్ కన్నా కమలా హారిస్‌ను ఓడించడమే చాలా సులభం అని ట్రంప్ వ్యాఖ్యానించడం తో రాజకీయాలు రసవత్తరంగా మారాయి. వైట్ హౌస్ రేసు నుండి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న నిర్ణయాన్ని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రశంసించారు. బైడెన్ తీసుకున్న నిర్ణయం దేశంపై ఆయనకున్న ప్రేమను చాటుతోందని ఒబామా వ్యాఖ్యానించారు. రెండోసారి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయని.. అయినప్పటికీ ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. అధ్యక్షుడిగా బైడెన్ అంతర్జాతీయ వేదికపై అమెరికా గొప్పతనాన్ని ఇనుమడింపజేశారని, నాటోను పునరుజ్జీవింపజేసినట్లు తెలిపారు.ఉక్రెయిన్ - రష్యా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలను ఏకం చేశారన్నారు. అయితే రానున్న రోజుల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటాయని, అధ్యక్ష అభ్యర్థి ఎంపికలో డెమొక్రటిక్ పార్టీ ఆచితూచి అడుగులు వేయాలని అప్రమత్తం చేశారు. అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌ని అధ్యక్ష బరిలో నిలపాలని ఆ పార్టీ ఆలోచిస్తున్నా.. ఒబామా ఈ అంశాన్ని లేవనెత్తకపోవడం, అభ్యర్థి ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని అనడం పార్టీలో చర్చనీయాంశం అవుతోంది. కమలా హారిస్ అభ్యర్థిత్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన ప్రక్రియతో ముందుకు రావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. ఒబామాను హారిస్‌కు మెంటార్‌గా చెబుతుంటారు. డెమోక్రటిక్ పార్టీకి చెందిన మరో కీలక నేత నాన్సీ పెలోసీ సైతం కమలా హారిస్‌కు మద్దతు ప్రకటించక పోవడంతో పార్టీలో అంతర్గత కుమ్ములాటలు జరుగుతున్నాయనే అనుమానాలు కలుగుతున్నాయి. 2007లో జిల్లా న్యాయవాదిగా పనిచేస్తూ.. అధ్యక్ష బరిలో నిలిచిన బరాక్ ఒబామాకు కమలా.. మద్దతు తెలిపారు. ఒబామా అధ్యక్షుడైన తర్వాత 2010లో ఆమె అటార్నీ జనరల్‌గా విధులు నిర్వహించారు. ఇకపోతే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిగా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా భార్య మిషెల్ ఒబామా ను బరిలో నిలుపుతారనే ఊహాగానాలు కూడా బలపడుతున్నాయి. పోటీ నుంచి తాను తప్పుకుంటున్నట్లు బైడెన్ ప్రకటించిన తరువాత మిషెల్ ఒబామా పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా నిలిచింది. ఓ వైపు కమలా హ్యారిసే డెమొక్రటిక్ పార్టీ తరఫున పోటీలో ఉంటుందని అంతా అనుకుంటుండగా.. మిషెల్ ఒబామా పేరు బయటకి రావడం గమనార్హం. ఆమె అభ్యర్థిత్వానికి పార్టీలోని చాలా మంది అనుకూలంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలకు మూడు నెలలు ముందు ఆగస్టులో జరిగే డెమోక్రాటిక్ నేషనల్ కన్వెన్షన్‌లో ఆ పార్టీ అభ్యర్థిగా మిషెల్ ఒబామాను ప్రకటించే అవకాశాలున్నాయని డెమోక్రాట్లు అభిప్రాయపడుతున్నారు. ది సెంటర్ స్క్వేర్ ఓటర్స్ వాయిస్ ఇటీవలే

నిర్వహించిన సర్వే ప్రకారం.. అమెరికా ఓటర్లు తమ తదుపరి అధ్యక్ష అభ్యర్థిగా మిషెల్‌నే కోరుకుంటునట్లు తేలింది. ఈ సర్వేలో కమలా హారిస్ కంటే మిషెల్‌కే ఎక్కువ మద్దతు లభించింది. కమలా హారిస్ అభ్యర్థి త్వానికి బైడెన్ మద్దతు ప్రకటించగా.. ఒబామా మాత్రం ఇప్పటివరకు ఆమెకు మద్దతు ప్రకటించకపోగా.. కొత్త నామినీ ఎంపిక కోసం సరైన ప్రక్రియతో ముందుకురావాలని పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఒబామా లెక్కలు వేరేగా ఉన్నాయని.. తన భార్యను అధ్యక్ష బరిలోకి దింపడానికే కమలాకు మద్దతు ప్రకటించట్లేదని అంతర్గతంగా చర్చ నడుస్తోంది. సాధారణంగా అమెరికాకు ఒక్కరు గరిష్ఠంగా రెండుసార్లు అధ్యక్షులుగా వ్యవహరించొచ్చు. ఒబామా రెండు పర్యాయాలు అమెరికా అధ్యక్షుడిగా పని చేశారు. ఇదే సమయంలో మిషెల్ ఒబామాకు నెటిజన్ల నుంచి మద్దతు వస్తోంది. ట్రంప్‌ని ఓడించగల ఒకే ఒక్క వ్యక్తి మిషెల్ అని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. 'దయచేసి మిషెల్ ఒబామాపై దృష్టి పెట్టండి. కమలా హారిస్‌ని పోటీలో నిలపకండి. ఆమెకు ప్రజా సమస్యలు పట్టవు. ట్రంప్‌ని ఓడించలేరు' అని ఓ నెటిజన్ కామెంట్ చేశాడు. డెమోక్రటిక్ నేషనల్ కమిటీ కన్వెన్షన్ ఆగస్టు 19న చికాగోలో ప్రారంభం కానుంది. నవంబర్‌లో జరిగే సాధారణ ఎన్నికలకు తమ అభ్యర్థిని ఎన్నుకునేందుకు దేశవ్యాప్తంగా దాదాపు 4 వేల మంది ప్రతినిధులు ఇక్కడ సమావేశమవుతారు. ఆ తరువాత అభ్యర్థులు అధ్యక్ష బరిలో నిలుస్తున్నట్లు నామినేషన్‌లు సమర్పిస్తారు. నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు జరుగుతాయి.

## వివాదంలో..
# ఐఏఎస్ స్మితా సబర్వాల్

(మొదటి పేజీ తరువాయి)

మీరు వైకల్యం ఉన్న సర్జన్‌ని విశ్వసిస్తారా అంటూ పోస్ట్ చేశారు. సివిల్ సర్వీసెస్ అధికారుల బాధ్యత అనేది ఫీల్డ్ వర్క్, పన్నులు విధించడం, ప్రజల మనోవేదనలను నేరుగా వినడం వంటివి ఉంటాయి. కాబట్టి ఈ ప్రీమియర్ సర్వీస్‌కు ఈ కోటా అవసరమా అని తన అభిప్రాయాలను వెల్లడించారు. స్మిత సబర్వాల్ పోస్ట్ చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వికలాంగుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలు ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. వికలాంగులను 'సంకుచిత దృక్పథం'తో చూడరాదని, వారి అర్హతపై ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. దీనిపై శ్రీకాంత్ మిర్యాల అనే రచయిత, సైకియార్టిస్ట్ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ప్రత్యక్ష ఉదాహరణలతో గతంలో ఎంబీబీఎస్ చదివేటప్పుడు తన ప్రిన్సిపాల్ కాలుకి పోలియో సోకి సరిగా నడవలేనివారు, అయినా కూడా ఎడమచేత్తో రాసి, పాఠాలు చెప్పారని గుర్తు చేశారు. ఇలా అనేక మంది దివ్యాంగులు పలు రంగాల్లో ఉన్నట్లు గుర్తు చేశారు. అంతేకాదు ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు ఇలా ట్వీట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. మీ పని మీరు సరిగ్గా చేయండి చాలు. అంతేకానీ మీకు సలహాలు ఇచ్చే స్థాయి ఇంకా రాలేదని చెబుతున్నారు. అంతేకాదు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దగ్గర పనిచేసిన ఈ అధికారిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేద్కర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణల మధ్య ఈ వివాదం మొదలైంది. యూపీఎస్సీ పరీక్షలో తన అభ్యర్థిత్వాన్ని పొందేందుకు వైకల్యం, ఇతర వెనుకబడిన తరగతి కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఫేక్ ఐడెంటిటీ ఇచ్చి అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయత్నించారనే ఆరోపణలపై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖేద్కర్‌పై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో స్మిత వ్యాఖ్యలు పలువురి విమర్శలకు కారణమయ్యింది.

## వైభవంగా మహంకాళి బోనాలు

**భవిష్యవాణి వినిపించిన మాతంగి**
**విస్తారంగా వర్షాలు కురుస్తాయని వెల్లడి**

**హైదరాబాద్,జూలై22(ప్రజాస్వరం):**

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాలు వైభవంగా సాగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి సిఎం రేవంత్ రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించాలి. అలాగే సిఎస్ శాంతికుమారి బోనం సమర్పించారు. ఇకపోతే సోమవారం తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చారు. బోనం, వడి బియ్యం, చీర సారెలతో అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. బోనాల సందర్భంగా రంగం భవిష్యవాణి కార్యక్రమం జరిగింది. రెండోరోజు సోవారం తెల్లవారుజాము నుంచే ఆలయానికి భక్తులు క్యూ కట్టారు. వడి బియ్యం, చీర సారెలతో భక్తులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. పచ్చి కుండపై నిలబడి మాతంగి స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. 'నాకు సంతోషంగా ఉంది. నాకు కావాల్సిన పూజలన్నీ అందిస్తున్నారు. బాలికలు, యువతులు, మహిళలు ఇలా ఎవరు బోనం సమర్పించినా స్వీకరిస్తా. పంటలు బాగా పండుతాయి. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి. కోరినన్ని వర్షాలు కురుస్తున్నాయి. నన్ను చూడాలంటే 48 గంటలు కష్టం అంటున్నారు. ఆమాత్రం కష్టపడలేరా?. ఏమి తెచ్చినా ఆనందంగా తీసుకుంటా. ఎలాంటి వ్యాధులు రాకుండా కాపాడుతా. ప్రజలను చల్లగా కాపాడుకుంటా. ప్రజలందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటా. నా రూపాన్ని పెట్టండి. నారూపాన్ని తప్పకుండా పెట్టించుకుంటా, నిలబెట్టుకుంటా. నా గ్రామ ప్రజలందరూ చల్లని సాగపడుతున్నారు.. అంటూ స్వర్ణలత భవిష్యవాణిలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కాగా, రంగం నేపథ్యంలో మహంకాళి అమ్మవారి దర్శనాలను అధికారులు నిలిపివేశారు. అంతకుముందు అంబారీ ఊరేగింపు అందరినీ ఆకట్టుకున్నది. సాయంత్రం 7 గంటలకు ఫలహారం బండ్ల ఊరేగింపుతో బోనాల జాతర ముగియనుంది.

## మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం

**అమరావతి,జూలై22(ప్రజాస్వరం):**

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై అత్యవసర విచారణకు ఆదేశించారు. వెంటనే ఘటనాస్థలికి హెలికాప్టర్‌లో వెళ్లాలని డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆదేశాలు జారీ చేశారు. సిఎం ఆదేశాలతో డీజీపీ, సీఐడీ చీఫ్ మదనపల్లెకు బయలుదేరారు. అగ్నిప్రమాదంలో కీలక దస్త్రాలు కాలిపోయినట్లు సమాచారం. నూతన సబ్‌కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి కొన్ని గంటల ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సీఎం ఆదేశించారు. ఈ ఘటనలో ఉద్దేశపూర్వకంగానే భూముల దస్త్రాలు తగులబెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో విలువైన రెవెన్యూ రికార్డులు, కంప్యూటర్లు, సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. కార్యాలయం సిబ్బంది విషయం తెలుసుకుని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక కేంద్రం పక్కనే ఉండటంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అయితే ఈ మంటల్లో విలువైన రెవెన్యూ రికార్డులు దగ్ధమైనట్లు తెలుస్తోంది. ఇదే కార్యాలయంలో పనిచేసే గౌతమ్ అనే ఉద్యోగి కార్యాలయంలో రాత్రి 12 గంటల వరకు ఉన్నట్లు సమాచారం. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్, జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఏఎస్పీ రాజ్‌కుమార్ ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలోనే సమీక్ష నిర్వహించారు. తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో ఆయన సమావేశమయ్యారు. సమీక్షకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా, సీఎంవో అధికారులు హాజరయ్యారు. అగ్నిప్రమాదంలో అసైన్డ్ భూముల దస్త్రాలు దగ్ధమైనట్లు ప్రాథమిక సమాచారం. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజ్ సహా సమస్త వివరాలు బయటకు తీయాలని చంద్రబాబు ఆదేశించారు. అన్నమయ్య జిల్లా కలెక్టర్‌తో చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. రాత్రి 11.24 గంటలకు ప్రమాదం జరిగినట్లు ఆయనకు జిల్లా అధికారులు వివరించారు. ఘటనపై జిల్లా అధికారుల సత్వర స్పందన లేకపోవడంపై సీఎం ఆరా తీశారు.ఆదివారం అర్ధరాత్రి వరకు కార్యాలయంలో గౌతమ్ అనే ఉద్యోగి ఉన్నట్లు గుర్తించారు. ఆ సమయం వరకు ఉద్యోగి ఉండటానికి కారణాలు తెలుసుకోవాలని చంద్రబాబు ఆదేశించారు. ఉద్యోగి ఎందుకు వెళ్లాడు.. ఏ పని కోసం వెళ్లాడు? అనే వివరాలను అడిగారు. ఘటన జరిగిన సమయంలో విధుల్లో గౌతమ్ ఉన్నాడని అధికారులు వివరించారు. ఘటనాస్థలికి పోలీసు జాగిలాలు వెళ్లాయా, ఏం విచారణ చేశారని సీఎం ప్రశ్నించారు. సీసీ కెమెరా దృశ్యాలు వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా అక్కడ సంచరించిన వ్యక్తుల వివరాలు సేకరించాలన్నారు. నేరాలు చేసి సాక్ష్యాల చెరిపేతలో ఆరితేరినోళ్లు మొన్నటి వరకు అధికారంలో ఉన్నారని ఈ సందర్భంగా సీఎం వ్యాఖ్యానించారు. గతంలో జరిగిన ఈ తరహా ఘటనలను అధికారులు మరిచిపోకూడదన్నారు. సాక్ష్యాల చెరిపివేత కోణంపై లోతుగా దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఘటనపై సమగ్ర వివరాలు తన ముందుంచాలన్నారు.

## ఎపి అసెంబ్లీలో ఆసక్తికర ఘటన


**అమరావతి,జూలై22(ప్రజాస్వరం):**

ఏపీ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మాజీ సీఎం జగన్, తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు మధ్య సంభాషణ జరిగింది. సమావేశాలు జరిగినన్ని రోజులూ సభకు రావాలని జగన్‌ను రఘురామ కోరగా.. హాజరవుతానని ఆయన బదులిచ్చారు. వాళ్లిద్దరూ ఇంకా ఏం మాట్లాడుకున్నారనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. గతంలో వైకాపా ఎంపీగా ఉంటూనే రఘురామ అప్పటి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. వైకాపా ప్రభుత్వం, జగన్ తీరును ఎప్పటికప్పుడు ఎండగట్టేవారు. ఈ క్రమంలో రఘురామ అరెస్ట్ తదితర పరిణామాలు జరిగాయి. ఆ తర్వాత కూడా ఆయన వెనక్కి తగ్గలేదు. ఈ నేపథ్యంలో జగన్, రఘురామ ఏం మాట్లాడుకున్నారనేదానిపై చర్చ జరుగుతోంది.

# సోషల్ మీడియా విమర్శలు...

పట్టించుకోవాల్సిన పనిలేదన్న జాన్వీ

ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన జాన్వీకపూర్ కోలుకుని ఇంటికి చేరుకుని.. రెండ్రోజుల్లోనే మళ్లీ యాక్టివ్ అయ్యాక వరుస ప్రమోషన్లో పాల్గొంటున్నారు. తన తదుపరి చిత్రం 'ఉలఝ్' చిత్రం విడుదల నేపథ్యంలో ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఆదివారం ఇచ్చిన ఇంటర్వ్యూలో సోషల్‌మీడియా ట్రోల్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆన్‌లైన్ వేదికగా స్టార్‌కిడ్స్ ఎదుర్కొంటున్న విమర్శలపై ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'సోషల్ మీడియాలో వచ్చే విమర్శలను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. అసలు వాటిని పట్టించుకోవడం కూడా వృథా. ఎందుకంటే, సోషల్‌మీడియా కల్చర్ అది. నువ్వు పబ్లిక్ ఫిగర్ అయినా, కాకపోయినా ఇలాంటివి నిరంతరం జరుగుతూనే ఉంటాయి. కాబట్టి ఆ కామెంట్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదు. ఒక విషయంలో ఈరోజు పొగిడినవాళ్లే అదే విషయంపై రేపు తిడతారు. ముక్కూ, మొఖం తెలియని వాళ్లు ఏదో అన్నారని ఇంట్లో కూర్చొని ఏడవడం దేనికి?. మనకు మనమే ప్రాధాన్యం ఇచ్చుకోవాలి' అని అన్నారు. అనంతరం అనంత్ అంబానీ సతీమణి రాధిక మర్చంట్ కోసం పార్టీ ఇవ్వడంపైజాన్వీ మాట్లాడారు. 'రాధిక నాకు మంచి ఫ్రెండ్. తను మాతో చాలా సరదాగా ఉంటుంది. మమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటుంది. అందుకే, వివాహానికి ముందు ఆమె కోసం ప్రత్యేకంగా ఒక పార్టీ ఏర్పాటుచేయాలని ఫ్రెండ్స్ అందరం అనుకున్నాం. అందులో భాగంగా గ్రాండ్ పార్టీ ఇచ్చాం. తను చాలా సంతోషించింది' అని చెప్పారు. 'ఉలఝ్' విషయానికి వస్తే.. జాతీయ అవార్డు గ్రహీత సుధాంశు సరియా తెరకెక్కించారు. జంగ్లీ పిక్చర్స్ సంస్థ నిర్మించింది. జాన్వీ ఇందులో ఇండియన్ ఫారిన్ సర్వీస్ అధికారిణిగా కనిపించనుంది. ఈ పొలిటికల్ థ్రిల్లర్‌లో గుల్షన్ దేవయ్య, రాజేశ్ థైలాంగ్ ముఖ్య పాత్రలు పోషించారు.



# ఎన్టీఆర్‌తో మల్టీస్టారర్ మూవీ చేయాలనుంది

**రాయన్ ప్రమోషన్‌లో నటుడు ధనుష్**

తమిళ నటుడు ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం రాయన్. సందీప్ కిషన్, మలయాళం నటుడు కాళిదాస్ జయరాం ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు ట్రైలర్‌లు విడుదల చేయగా.. ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాను ఈనెల 26న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. విడుదల తేదీ దగ్గరపడటంతో ఆదివారం హైదరాబాద్‌లో భారీ ఎత్తున్న ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వేడుకలో ధనుశ్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు. టాలీవుడ్‌లో తన ఫేవరెట్ హీరో పవన్ కళ్యాణ్ అని వెల్లడించారు. 'ఐ లవ్ సినిమా, ఐ లవ్ పవన్ కళ్యాణ్ సర్' అంటూ చెప్పుకొచ్చారు. ఇక ధనుశ్ చేసిన ఈ వ్యాఖ్యలకు ఆడిటోరియం అంతా దద్దరిల్లిపోయింది. జూనియర్ ఎన్టీఆర్‌తో మల్టీస్టార్టర్ మూవీ చేయాలని ఉందని ధనుశ్ అన్నారు. చిత్ర కథ విషయానికి వస్తే.. అతనో సాధారణ వ్యక్తి. మద్రాస్‌లోని ఓ హోటల్‌లో చెఫ్‌గా పనిచేస్తుంటాడు. కానీ అతని గతం మాత్రం పగతో రగిలిపోతుంటుంది. ప్రతీకారం తీర్చుకునే సమయం కోసం ఎదురుచూస్తుంటాడు. ఇంతకి ఆ వ్యక్తి ప్రతీకారం ఎవరి మీద? పేరు మోసిన గ్యాంగ్‌స్టర్ అయిన అతను హోటల్‌లో చెఫ్‌గా ఎందుకు పనిచేయాల్సి వచ్చింది? ఈ ప్రశ్నలకు సమాధానం దొరకాలంటే 'రాయన్' సినిమా చూడాల్సిందే అని చెబుతోంది చిత్ర బృందం.ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో పాటు ధనుష్ ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు.






# భారతీయుడు-2 బాగుందంటూ తలైవా కితాబు

విలక్షణ నటుడు కమల్‌హాసన్- సుప్రసిద్ధ దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'భారతీయుడు-2' ఇటీవలే విడుదలయ్యింది. అయితే చిత్రానికి మొదటిరోజే భారీ ఫ్లాప్ టాక్‌ను తెచ్చుకుంది. ముఖ్యంగా శంకర్‌పై విమర్శలు వెలువెత్తాయి. కంటెంట్ లేకుండా భారీగా ఖర్చుపెట్టారు. కానీ సినిమా మత్రం ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయింది అంటూ కమల్ అభిమనులతో పాటు సగటు ఆడియన్స్ కూడా నిరాశ చెందారు. ఈ చిత్రం తనకు నచ్చిందని సినిమా బాగుందని తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ కామెంట్స్ చేయడం అందరిన్ని ఆశ్చర్యపరిచింది. కేరళలోని ఓ వివాహానికి హాజరై చెన్నయ్ ఎయిర్‌పోర్టులో మీడియాతో మాట్లాడుతూ పై విధంగా వ్యాఖ్యానించారు రజనీకాంత్. దీంతో పాటు బయట ప్రచారం జరగుతున్నట్లుగా తన 'వేట్టయాన్' సినిమా వాయిదా పడలేదని, షూటింగ్ శరవేగంగా జరుగు తుందని,తన పార్ట్ డబ్బింగ్ కూడా పూర్తయిందని.. దసరాకు చిత్రాన్ని విడుదల చేసే అవకాశం వుందని స్పష్టం చేశారు. సూర్యతో 'కంగువ' చిత్రాన్ని నిర్మిస్తున్న నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా ఇంతకు ముందు వేట్టయాన్ వాయిదాపై మాట్లాడారు. దీంతో పాటు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న కూలీ చిత్రంలో కూడా రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ నేపథ్యంలో పూర్తి యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా.. ఈ సినిమా రూపొందుతోంది. శ్రుతిహాసన్, సత్యరాజ్ ఈ చిత్రంలో ముఖ్యపాత్రలో కనిపిస్తారు.

# ఆసక్తి రేకెత్తిస్తున్న రాజమౌళి..మోడ్రన్ మాస్టర్స్

**అతనో లెజెండ్ అంటూ చిత్ర ప్రముఖుల కామెంట్స్**




టాలీవుడ్ అగ్ర దర్శకుడు రాజమౌళిపై ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ 'మోడ్రన్ మాస్టర్స్' పేరుతో డాక్యుమెంటరీ రూపొందించింది. ఇందులో ఆయన సినీ ప్రయాణాన్ని చూపించనున్నారు. ఆగస్టు 2 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా ఇది స్ట్రీమింగ్ కానుంది. తాజాగా దీనికి సంబంధించిన ట్రైలర్‌ను విడుదల చేయగా అది అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. అందులో టాలీవుడ్, బాలీవుడ్, హాలీవుడ్ సినీ ప్రముఖులు రాజమౌళిపై వారి అభిప్రాయాలను పంచుకున్నారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్‌లతోపాటు హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్, బాలీవుడ్ దర్శకనిర్మాత కరణ్ జోహర్‌లు కూడా వారి అభిప్రాయాన్ని తెలియజేశారు. ఇలాంటి దర్శకుడిని నేను ఇప్పటివరకు చూడలేదు. సినిమాలంటే ఆయనకు పిచ్చి ప్రేమ అని ప్రభాస్ తన అబిప్రయాం పంచుకున్నారు. ఆయన సినిమాల్లో నన్ను నేను చూసుకొని ఎంతో ఆశ్చర్యపోతానని నటుడు రామ్‌చరణ్ ప్రకటించారు. ఇప్పటివరకు ఎవరూ చూపించని కథలను ప్రపంచానికి చెప్పడం కోసమే రాజమౌళి జన్మించారని మరో నటుడు ఎన్టీఆర్ అన్నారు. ఈ ఇద్దరు కూడ ఆరాజమౌళి ట్రిపుల్ ఆర్‌లో మంచి నటనను చాటారు. రాజమౌళికి సాధ్యం కానిది ఏదీ లేదు. ఎవరితోనైనా పని చేయగలరు. ఆయనంటే నాకెంతో గౌరవం అంటూ ఆంగ్ల చిత్రాల దర్శకుడు జేమ్స్ కామెరూన్ వ్యాఖ్యానించారు. రాజమౌళితో పని చేసిన వారందరూ ఆయన్ని పని రాక్షసుడని పిలుస్తుంటారని ఆయన భార్య, ప్రముఖ క్యాస్టూమ్స్ డిజైనర్ రమా రాజమౌళి అభిప్రాయపడ్డారు. దర్శకుడు రాజమౌళి ఓ లెజెండ్ అని హిందీ దర్శక సమర్పకుడు కరణ్ జోహార్ అన్నారు.

# అమీర్‌తో విడిపోయాకా బాగానే ఉన్నా

**దర్శకురాలు కిరణ్ రావు వెల్లడి**

ఆమిర్‌ఖాన్‌తో వైవాహిక జీవితానికి స్వస్తి పలకడంపై ఆయన మాజీ సతీమణి, దర్శకురాలు కిరణ్‌రావు స్పందించారు. విడాకుల తర్వాత తాను కుంగిపోలేదని, సంతోషంగా ఉన్నానని చెప్పారు. ఇరు కుటుంబాలు తనకు అండగా ఉన్నాయని చెప్పారు. సంబంధాలు ఎప్పటికప్పుడు పునర్నిర్వచించబడాలని నేను భావిస్తున్నా. ఎందుకంటే, మనం పెరిగేకొద్దీ మనుషులుగా మారతాం. సుమారు 16 ఏళ్ల వైవాహిక బంధానికి స్వస్తి పలకాలని నిర్ణయించుకున్నప్పుడు ఎమోషనల్, మానసికంగా దానిని తట్టుకోవడానికి కాస్త సమయం పట్టింది. విడాకుల తర్వాత సంతోషంగా ఉంటాననుకున్నా. అదే జరిగింది. ఆమిర్ నా జీవితంలోకి రావడానికి ముందు చాలా ఏళ్లు సింగిల్‌గానే ఉన్నా. నా స్వతంత్రతను ఎంజాయ్ చేశా. కాకపోతే అప్పట్లో కొన్నిసార్లు ఒంటరిగా ఫీలయ్యా. కానీ, ఇప్పుడు అలా కాదు. నా కొడుకు ఆజాద్ ఉండటంతో ఒంటరితనం నా దరి చేరదు. ఇరు కుటుంబాల నుంచి నాకు సపోర్ట్ ఉంది. ఆమిర్‌తో ఇప్పటికీ నాకు మంచి అనుబంధం ఉంది' అని చెప్పారు.ఆమిర్‌ఖాన్ నటించిన 'లగాన్'కు కిరణ్‌రావు అసిస్టెంట్ డైరెక్టర్‌గా వర్క్ చేశారు. 2005లో ఆమిర్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక బాబు ఉన్నాడు. పరస్పర అంగీకారంతో సుమారు 16 ఏళ్ల వైవాహిక బంధానికి 2021లో స్వస్తి పలికారు. కిరణ్‌రావును వివాహం చేసుకోవడానికంటే ముందు ఆమిర్‌కు వివాహమైన విషయం తెలిసిందే. వర్క్ విషయానికి వస్తే.. దర్శక నిర్మాతగా కిరణ్‌రావుకు బాలీవుడ్‌లో మంచి పేరు ఉంది. ఇటీవల 'లాపతా లేడీస్'తో దర్శకురాలిగా మంచి విజయాన్ని అందుకున్నారు.



Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154